తెలుగు వైతాళికులు:

# అన్నమాచార్య



పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ

# అన్నమాచార్య

రచన

శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు

సంపాదకులు

డాక్టర్. నాగభైరవ కోటేశ్వరరావు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్
2006

**ANNAMACHARYA**
**by Sri Kamisetty Srinivasulu**

ప్రచురణల సంఖ్య : 50

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రథమ ముద్రణ : 1988

ద్వితీయ ముద్రణ : 1990

తృతీయ ముద్రణ : నవంబరు 2006

ప్రతుల సంఖ్య : 1000

వెల : రూ. 15/-

విగ్రహ రూపకల్పన : శ్రీ డి. ఎన్. రత్నశిల్పి ఒడయార్

*ప్రతులకు :*

డైరెక్టర్
ప్రచురణల విభాగం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

*ముద్రణ :*

నవ్య ప్రింటర్స్
హైదరాబాద్

ISBN: 81-86073-147-8



# సందేశం

నిద్రాముద్రితమైన జాతిని జాగృతం చేసి, భద్రాయిత మూర్తిగా తీర్చిదిద్దిన మహావ్యక్తుల పవిత్ర జీవిత చరిత్రలు మన చిన్నారులకు ఉత్తేజకారకాలు, ఉత్సాహప్రేరకాలు, రేపటి పౌరులైన బాల బాలికలలో మంచి నడవడినీ, గట్టి పట్టుదలనూ, కలిసి కట్టుతనాన్నీ, దేశభక్తినీ, సేవాసక్తినీ, మాతృ భాషానురక్తినీ పెంపొందించడానికి ఈ రీతి రచనల ప్రచురణ ఎంతైనా అవసరం.

గ్రంథ పరంపర ప్రచురణకు రూపకల్పన చేసిన తెలుగు విశ్వవిద్యాలయంవారికి మనఃపూర్వకమైన అభినందనాలు; ఉత్తమాశయ మహితమైన ఈ ఉద్యమంలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను భాగస్వామ్యం వహించిన సంస్కృతి ప్రియులకు సాహితీ పరులకు కళాభివందనాలు.

హైదరాబాదు,
విభవ ఉగాది,
మార్చి 18,1988

'కళాప్రపూర్ణ'
**నందమూరి తారక రామారావు**
కులాధిపతి, తెలుగు విశ్వవిద్యాలయం

# పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
## హైదరాబాద్

**డా॥ ఎ. మంజులత**
ఉపాధ్యక్షులు

## ముందుమాట

రెండు సహస్రాబ్దాలకు మించిన సుదీర్ఘ చరిత్రతో విరాజిల్లుతున్న జాతి ఆంధ్రులది. ప్రతిరంగంలోనూ అత్యున్నత శిఖరాలందుకున్న మహనీయు లెందరో జాతి కీర్తి కేతనాన్ని సమున్నతంగా ఎగరవేశారు. వీరిలో 33 మంది తేజోమూర్తుల విగ్రహాలు "తెలుగు వెలుగుల మూర్తి నిక్షిప్త కళాప్రాంగణం" పేరిట హైదరాబాదు హుసేన్ సాగర్ తటిని సురుచిర వేదికగా చేసుకుని, తెలుగుజాతి వైభవోన్నతుల్ని జగతికి చాటుతున్నాయి.

ఈ మహాత్ముల ఆదర్శ జీవిత చరిత్రల్ని 'తెలుగు వైతాళికులు' అనే శీర్షిక క్రింద గ్రంథమాలగా ప్రచురించే కార్యక్రమాన్ని పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం చేపట్టింది.

తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల వికాసాభ్యుదయాలకోసం ఈ విశ్వవిద్యాలయం 1985లో ఏర్పాటైన సంగతి పాఠకలోకానికి తెలిసిందే. అంతేకాదు, పూర్వమున్న వివిధ అకాడమీలనూ, కేంద్రాలను అంతర్లీనం చేసుకొని బహుముఖ సేవాకార్యకలాపాలకు విశ్వవిద్యాలయం సమైక్య

వేదికగా వ్యవహరిస్తున్న విషయం కూడా అందరికీ విదితమే. అందుచేతనే విశ్వవిద్యాలయం నిర్వహించే వివిధ కర్తవ్యాల్లో గ్రంథ ప్రచురణ ముఖ్యస్థానం వహిస్తోంది.

ముఖ్యంగా తెలుగు పైతాళికులు శీర్షిక క్రింద వెలువడిన లఘు గ్రంథాలకు అపూర్వమైన ఆదరణ లభించడంవల్ల వీటిని పునర్ముద్రిస్తున్నాం.

శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుగారి 'అన్నమాచార్య' కృతికి ఇది తృతీయ ముద్రణ.

పదకవితా పితామహుడుగా, శ్రీ వేంకటేశ్వర సంకీర్తన ప్రవణుడుగా విఖ్యాతుడైన అన్నమాచార్యుని జీవిత విశేషాలనూ, రచనా వైశిష్ట్యాన్ని శ్రీనివాసులుగారు ఈ గ్రంథంలో ఆవిష్కరించారు.

ఆరువేల పైచిలుకు ప్రతులు చెల్లుబడి అయిన ఈ గ్రంథంపై సహృదయులు అదే ఆదరణ చూపుతారని ఆశిస్తున్నాం.

హైదరాబాద్
22.11.2006

(ఎ. మంజులత)

# అన్నమాచార్య

అన్నమయ్య జన్మభూమి తాళ్ళపాక కడప మండలానికి చెందినది. పదిహేనవ శతాబ్దంలో ఈ భూములకు పొత్తపినాడని వ్యవహారం. నైసర్గికంగా ఇది చాల అందమైన ప్రదేశం. కొండలు, కోనలు, నదులు, విశాలమైన తటాకాలు, ఫలాలతో పుష్పాలతో నిండిన వనాలతో, ఈ సీమ సహజ రామణీయకతతో విరాజిల్లేది. కన్నప్పగ వాసి గాంచిన మహా శివ భక్తుడు పుట్టి పెరిగిన దిక్కడనే. ఈ పొత్తపినాట పెన్నా నది చెయ్యేరనే పేరుతో ప్రవహిస్తుంది. దీనిని 'బాహుద' అని కూడ వ్యవహరిస్తారు. ఇక్కడ ప్రతి నదికీ పాడడానికి ఒక పాట ఉంది. ప్రతి కొండకు వినిపించడానికి ఒక కథ ఉంది. కాని దురదృష్టవశాత్తు అవి పాడలేవు, పలుకలేవు. ఒకవేళ పాడినా, పలికినా, విని అర్థం చేసుకొనే చరిత్రకారులు లేరు. చెయ్యేరు చెప్పే కథ ఇది. పరశురాముడు తండ్రి ఆజ్ఞను పాటించి తల్లిని హత్య చేశాడు. మాతృ హత్యా పాతకానికి శిక్షగ తన రెండు చేతులను ఖండించుకొన్నాడు. ఈ నదిలో మునకలు వేయగా చేతులు తిరిగి వచ్చాయట. అందుకే దీనిని చెయ్యేరన్నారని ఐతిహ్యం. ఇక్కడ పరమశివునితోబాటు

పరశురామునికి కూడ గుడి వెలసింది. ఈ తీర్థాన వెలసిన క్షేత్రానికి 'అత్తిరాల' అని పేరు. తాళ్ళపాకకు సమీపంలోని నెందలూరులో బౌద్ధారామాలు బయల్పడ్డాయి. ఈ ఊరికి సమీపంలోని ఒంటిమిట్ట ప్రసిద్ధ కోదండరామ క్షేత్రం. పోతన మహాకవి భాగవత మందార మకరందాలను అందించిన దిక్కుడనే అని ప్రజల విశ్వాసం. కుందవరపు కవి చౌడప్ప పుట్టి పెరిగినదీ ప్రాంతాలలోనే. 'అష్టదిగ్గజాలలో' చోటు చేసుకొన్న అల్లసాని పెద్దన, అయ్యలరాజు రామభద్రుడు, భట్టుమూర్తి, మరియు నవీన గుణ సనాథుడు నాచనసోమన ఈ సీమకు చెందినవారే. సంగీత సాహిత్యాలు చెట్టపట్టాల్ పట్టుకొని నడచిన చోటిది. పదం, పద్యం పరుగు పందాలుగ సాగిన ప్రాంతమిది మతం సంస్కృతి మమతానురాగాలు పెంచిన దేశమిది. రాజకీయపు చదరంగాలలో ఎత్తులకు పైయెత్తులు వేసిన సన్నివేశమిది. విప్లవాలకు, ఉద్యమాలకు ఊపిరులూదిన పుడమి యిది. రాళ్ళకే కాదు రతనాలకు కూడ కేంద్రమైన రాయలసీమ యిది. సాంస్కృతికంగా, రాజకీయంగా కీలకమైన పొత్తపినాడు నడిబొడ్డులో మొలచిన తాళ్ళపాక సిరులకు పట్టుకొమ్మ. మగసిరులకు పుట్టినిల్లు. 'అచట పుట్టిన చిగురుకొమ్మైన చేవ'.

తాళ్ళపాకలో శివకేశవ అద్వైతమే కాని, వైషమ్యం కానరాదు. సిద్ధేశ్వరాలయముతోపాటు చెన్నకేశవస్వామి గుడీ ఉన్నది. పవిత్రము, సుందరము అయిన తాళ్ళపాక వాతావరణానికి మురిసి కాబోలు దేవతలు దివినుండి భువికి దిగి వచ్చేవారు. సిద్ధపురుషులు, ప్రసిద్ధులైన ఋషులు ఈ దేవుళ్ళకు నిత్య పూజలు నిర్వహించేవారట. ఆ దేవాలయాలను చూపెట్టుకొని కొన్ని నందవరీకస్మార్త బ్రాహ్మణ కుటుంబాలు జీవించేవి. వారు సర్వశాస్త్రపారంగతులు, సకలకళాధురీణులు. ఆ పండితులు మాధవారాధనతోబాటు మానవ సేవలో తత్పరులైనవారు. బుద్ధితో, భూతదయతో, చిత్తశుద్ధితో, శుద్ధ సత్త్వమూర్తులై జీవయాత్ర సాగించేవారు. ఆ పరమ భాగవతుల వంశాంకురం,హరినందకాంశంలో, అన్నమయ్యగ అవతరించినది. భక్తి ప్రపత్తులతో సంసారం సాగించే ఆ వంశస్థులకు మూల పురుషుడు నారాయణయ్య. వీరిది భరద్వాజ గోత్రం.

అన్నమయ్య తాత నారాయణయ్య గురించి ఒక కథ ప్రచారంలో ఉంది. చిన్నతనంలో నారాయణయ్యకు చదువు ఒంట పట్టలేదు. ఉన్న ఊరిలో కాదని సమీపంలో ఉన్న ఊటుకూరికి పంపారు. అక్కడ కూడ నారాయణయ్యకు చుక్కెదురైనది. గురువులు వానిలో సరస్వతిని చూడడానికి శతవిధాల ప్రయత్నం చేసి విఫలులయ్యారు. కోదండం

వేసినా, కోలగగ్గెర తగిలించినా నారాయణయ్యలో మార్పు రాలేదు. ఇంటా బయటా, అందరూ అతనిని అవహేళన చేశారు 'చదువురానిమొద్ద'ని. ఆ పసిమనసు గాయపడినది. 'ఈ బ్రతుకుకంటె చావు మేల'ని చింతలమ్మ గుడికి వెళ్ళి అక్కడ పుట్టలో చేయి పెట్టాడు. పాముకు బదులు నారాయణయ్యకు చింతలమ్మ ప్రత్యక్షమైనది. 'నారాయణా! తాళ్ళపాకకు వెళ్ళు. చెన్నకేశవుడు నీకు సకల విద్యలు అనుగ్రహిస్తాడు. మీ వంశంలో ఒక మహాపురుషుడు అవతరిస్తాడు' అని ఆ బాలుని చింత తీర్చి ఆశీర్వదించినది. చింతలమ్మ ఆదేశం, చెన్నకేశవుని అనుగ్రహం, నారాయణయ్య అచిర కాలంలోనే మహాపండితుడయ్యాడు. ఈ నారాయణయ్య కుమారుడే నారాయణసూరి. అతడు ఆతత విద్యా దురంధరుడు.

అన్నమయ్య తల్లి లక్కమాంబ. తాళ్ళపాకకు సమీప గ్రామం మాడుపూరు, ఆమె పుట్టినిల్లు. మహా భక్తురాలు. అక్కడ విష్ణుమూర్తి కోవెల ఉన్నది. ఆ మాధవునితో ఈమె ప్రత్యక్షంగ మాట్లాడేదని ప్రతీతి. లక్కమాంబ నారాయణసూరి ధర్మపత్ని. సంతానం కోసం ఆపదమొక్కులవానికి ముడుపు కట్టుకొన్నారు. ఏడుకొండలవాని సన్నిధికి యాత్ర చేశారు. స్వామి గరుడగంభం వద్ద వారి కొక దివ్యానుభూతి కలిగింది. కొండలయ్య తాను ధరించే "బిరుదుగజ్జియల

ముప్పిదికతారాన్ని" వారి కందజేశాడు. శ్రీనివాసుని అను గ్రహాన్ని పొందిన ఆ దివ్యదంపతులు తాళ్ళపాక చేరు కొన్నారు. ఒక శుభ లగ్నంలో మూడు గ్రహాలు ఉచ్ఛ దశలో ఉండగ వైశాఖ మాసం విశాఖ నక్షత్రంలో హరినంద కాంశంలో అన్నమయ్య అవతరించాడు. మానవ కల్యాణం కోసం ద్రావిడ వేదాన్ని పాటలుగా పాడిన నమ్మాళ్వారు కూడ వైశాఖ-విశాఖలోనే జన్మించారు.

లక్కమాంబ ఉగ్గుపాలతో రంగరించి పోసిన భక్తి అన్నమయ్య మనసులో వెన్నెలలను చిలికించినది. ప్రాక్తన సంస్కార సిద్ధమైన వేంకటేశ మంత్రము అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో చోటు చేసుకొన్నది. వెంకటప్పకు జోతలు పెడ్తూ, తప్పటడుగులు వేస్తూ, బోసినవ్వు లొలకబోసే అన్నమయ్యను 'చిన్ని కృష్ణుడని' తల్లి మురిసిపోయేది. చింతకాయల జడలతో, పొట్టమీద పాలచారలతో లక్కమాంబ చీరె కుచ్చిళ్ళు లాగుతూ పారాడే బాల అన్నముని ముద్దాడని అమ్మలక్కలు ఆ ఊరలేరు. వెంకన్న మేలుకొలుపులు విని, మేలుకొనే అన్నమయ్య కొండలయ్య పేరు చెప్పంది ఉగ్గు పాలు తాగేవాడు కాదు. కోనేటిరాయని పేర జోల పాడంది నిదురపోడు. లక్కమాంబ 'భక్తి భజనలు' విప్పారిన కళ్ళతో వినేవాడు. కూనిరాగాలు తీస్తూ అందరినీ నవ్వించే వాడు. నారాయణసూరి కావ్యగానం చేస్తూ, తాత్పర్యాన్ని

వివరిస్తూ ఉంటే ఏదో అర్థమైనట్లు తలపంకించేవాడు. అన్నమయ్యకు ఐదేండ్లు నిండాయి. ఉపవీత సంస్కారం పొందిన అన్నమయ్య శాస్త్రాధ్యయనం ఇంటి గురుకులం లోనే సాగింది. ఏకసంధాగ్రాహి అయిన అన్నమయ్యకు అన్ని విద్యలు కరతలామలకాలైనవి. ఇక అన్నమయ్యకు నేర్పించ వలసినదేమీ లేదని తెలుసుకోవడానికి గురువులకెంతో కాలము పట్టలేదు. ప్రతిభ, వ్యుత్పత్తి అభ్యాసగతమైనవి. భావసమాధి కార్యరూపం ధరించడానికి సిద్ధమైనది. అన్నమయ్య ఆడింది అమృతమయ కావ్యంగా, పాడింది పరమగానంగా భాసించింది.

అన్నమయ్య బడిలో కంటె ప్రకృతి ఒడిలో నేర్చు కొన్నది ఎక్కువ. అతని మానసిక వికాసానికి తోడ్పడినది ప్రకృతి, ప్రజలు. పంటపొలాలలోనో, కొండగుట్టల మీదనో చాలప్రొద్దు గడిపేవాడు. చెరువు కట్టలమీద కూర్చొని నీటి తళతళలను చూస్తూ చేపలతో ఆడుకొనేవాడు. తామరపువ్వు లను హారంగ కూర్చి 'బుజ్జి చెన్నకేశవు' నకు అలంకరించే వాడు. రకరకాల పక్షుల కూతలను అనుకరిస్తూ వానిని వెక్కి రించేవాడు. శ్రామికుల పాటలు వింటూ మనసులో ఏదో వింగడించేవాడు. వెన్నెల కుప్పలంటూ ఒయ్యారి భామలు ఆడుతూ పాడే జాజర పాటలకు, అల్లోనేరేళ్ళకు తాళం వేసే వాడు. ఆ కన్నెపిల్లలను మీకేమీ తెలియదు పొమ్మని ఎగతాళి చేసేవాడు. పదాలు పాడుతూ, చిందులు వేసే అల్లరి

అన్నమయ్యను ఊరు కావాలన్నా విధి ఊరుకోలేదు. నారాయణయ్య ఎందుకో ఆనాడు విసుగుపడ్డాడు. 'పిచ్చి పాటలు మాని ఇంటిపని చూడ'మన్నాడు. అడవికి వెళ్ళి పశువులకు కసవు తెమ్మన్నాడు. అన్నమయ్య కొడవలి భుజాన వేసుకొని బయలుదేరాడు. అమ్మ యిచ్చిన కాసును వంచె కొంగున జాగ్రత్తగ ముడివేసుకొన్నాడు. 'బుజ్జి చెన్న కేశవా!' అని ఊరి పెరుమాళ్ళను పలుకరించి ముందుకు సాగినాడు అన్నమయ్య, కాగల భాగ్యశాలి.

అడవిలో గరిక పచ్చగ పాపంలా తీగెలు సాగింది. శ్రీపతి నామమనే కొడవలితో గడ్డిని కోస్తున్నాడు అన్నమయ్య. అలవాటు లేని పని. కొడవలి చిటికెన వ్రేలును కోసింది. రక్తం బొటబొటా స్రవించింది. అన్నమయ్య బాధతో తల్లడిల్లిపోయాడు. రక్తం చూస్తూనే విరక్తి కలుగ సాగింది. 'తల్లీ తండ్రి అంతా అబద్ధం. ఈ బంధాలు అశాశ్వతం. ఈ బంధుత్వాలు భగవద్భక్తికి అవరోధాలు.' అన్నమయ్య మానస బోధ వివేక చింతామణి అయింది. ఇంతలో 'గోవింద గోవింద' అనే నినాదాలు వినిపించాయి. ఆ ఘోషలు చేసింది అడవి మార్గంలో తిరుపతికి వెళ్ళే యాత్రికుల గుంపు. అన్నమయ్య వాళ్ళ చెంత చేరాడు. సనకాదులనే భక్తుల బృందం అది. వాళ్ళ వేషాలు తమాషాగా ఉన్నాయి. జింక చర్మంతో చేసిన టోపీలు పెట్టుకొన్నారు. నెమలి పింఛాలను

అలంకరించుకొన్నారు. అభ్రకము, ఆకులు కలిపి కుట్టిన బట్టలు వేసుకొన్నారు. పిలి కుచ్చులతో తీర్చిన విండ్లు ఎక్కు పెట్టబడి ఉన్నాయి. చేతుల్లో బాణాలు, కాళ్ళకు కంచు టందెలు, శంఖ చక్రాల ముద్రికలు. ఒంటినిండా నామాలు. దండెలు మీటుకుంటూ, చిరుతలు వాయిస్తూ, మద్దెలలు మ్రోగిస్తూ, భక్తి పారవశ్యంతో పాడుతున్నారు. అన్నమయ్య ఆ గుంపులో కలసి పాడుతున్నాడు. "వేదుకొందామా వేంకటగిరి వేంకటేశుని." పాటతోపాటు ఆ పురుమల గుంపు తిరుపతి చేరుకొన్నది.

తిరుపతి రామానుజాచార్యుల కృషి ఫలితంగా గోవింద రాజ పట్టణంగ ప్రసిద్ధి పొందింది. గరుడ వ్యూహంతో తీర్చి దిద్దిన ఆ స్వామి నగరు రెండవ శ్రీరంగంగ భాసిల్లింది. అక్కడ గొల్లల పాలిటి శక్తిగ నిలిచిన గ్రామ దేవత గంగమ్మకు నమస్కరించి ఆళ్వారు తీర్థంలో ఆహ్నికం తీర్చుకొని, అళిపిరి చేరుకున్నాడు. అది పరమపదం చేరడానికి తొలిపాదం. అక్కడ నరసింహస్వామిని దర్శించుకొని, అగణిత మహిమల తలేరు గుండును స్పృశించి, కొండ ఎక్క సాగాడు. పెద్ద యెక్కుడును దాటి, అళిపిరి చేరుకున్నాడు. కప్పురపు వాసనలు గుప్పుమనే కర్పూరపు కాలువను దాటి, దారి పొడుగునా దట్టంగ వ్యాపించిన చెట్లను, కొండవాగులను చూచుకొంటూ, అడవి పువ్వులను తాకుతూ, కొండముచ్చులను

పలుకరిస్తూ, మిట్టమధ్యాహ్ననికి మోకాళ్ళ కొండ చేరు కున్నాడు. ఒకవైపు ఆకలి, మరొకవైపు అలసట ఆ ఎనిమి దేండ్ల బాలుని అలముకొన్నది. అడుగు ముందుకు సాగలేదు. అక్కడ ఒక వెదురు పొద క్రింద శోష వచ్చినట్లు పడి పోయాడు. వెదురు బొంగులలో దూరిన గాలి, ఆ బాల భక్తు నికి వేణువులూది జోల పాడినది. ఆ పసిబాలుని ఆకలిని, అలసటను ఎవరు గమనించినా గమనించక పోయినా జగన్మంగళ అలవేలుమంగ గమనించి, కనికరించి, హరి నుండి గిరికి దిగి వచ్చినది. పెద్ద ముత్తైదువులా ప్రసాదాల గిన్నె పట్టుకొని బాలుని చెంత చేరింది. అన్నమయ్యను తన ఒడిలో చేర్చుకొని మృదువుగా పిలిచినది. తల్లి లక్కమాంబ పిలిచినట్లయినది. "తల్లీ! నాకు కళ్ళు కనిపించడం లేద" న్నాడు. 'ఈ పర్వతం సాలగ్రామమయం. నాయనా! చెప్పు కాళ్ళతో ఎక్కరాద'న్నది. అమ్మ మాట విని అన్నమయ్య చెప్పులను తొలగించాడు. ఎట్ట యెదుట పెద్ద ముత్తైదువ. ఆ తల్లి యిచ్చిన ప్రసాదాలను భుజించాడు. అన్నమయ్య గొప్ప దివ్యానుభూతికి లోనయ్యాడు. ఆమె సాక్షాత్తు అలమేలుమంగ. ఆ కొండలో హరి దశావతారాలు గోచ రించాయి. శిలలలో వేదాలు వినిపించాయి. చెట్లలో మునులు గోచరించారు. జంతువులలో దేవతలు కనిపించారు. అన్న మయ్యలో సరస సారస్వతాంశ ప్రవేశించినది. అలమేలు

మంగను, ఈ తాళ్ళపాక బాలుడు శతక మాలికతో అలంక రించాడు. చంపకోత్పలాలతో అర్చించాడు. ఆ తల్లి అను గ్రహం వల్ల అన్నమయ్య తిరుమల శిఖరాలు చేరుకున్నాడు.

వేంకటాచలం పాపాలను దహించే కొండ. శేషాచలం ఆదిశేషుని సాక్షాత్కార వైభవం. తిరుమల పరమపావనమై శ్రీదేవికి పీఠస్థానమైనది. వేంకటపతి కలియుగ ప్రత్యక్ష దైవం. దేవతలు ఈ తిరుమూర్తికి ఆకాశం నుండి అనుదినం పూలవాన కురిపించి, అభిషేకం చేసేవారట. అందుకే దీనికి 'పుష్పమండప'మని పేరు. తండ్రి నారాయణసూరి వినిపించిన క్షేత్ర రహస్యాలను నెమరు వేసుకుంటూ, అన్నమయ్య వేంకటపతి సన్నిధానానికి ఉన్ముఖుడయ్యాడు. కోనేటిలో స్నానం చేశాడు. ప్రక్కన స్వామి పుష్కరిణిని దర్శించి, ఉభయనాంచారులతో ఆ పుష్కరిణీ జలాలలో తెప్పలతేలే స్వామి వైభవాన్ని తలచుకొన్నాడు. స్వామి పుష్కరిణి వైకుంఠములోని క్రీడా సరోవరమే. దాని దరులు ధర్మార్థ కామమోక్షాలు. సోపానాలు వేదాలు. జలచరములు దేవతలు. లోకపావని పుష్కరిణిని నుతించి, ఆదివరాహ స్వామిని దర్శించుకొన్నాడు. ఇది సంప్రదాయం. తొలుత తిరుమలకు వరాహ క్షేత్రమని పేరు. శ్రీనివాసునికి నిలువ నీడ కల్పించిన దీ వేల్పే. అందుకే 'తొలుత ఆదివరాహస్వామి దర్శనము, తర్వాత నా సన్నిధి' అని దేవుడే కట్టడి చేశాడట. నేటికీ

వరాహస్వామికే తొలి పూజా నైవేద్యాలు ఆలయ సంప్ర దాయంలో సాగుతున్నవి. వేంకటపతి కోవెల పెద్దగోపురము ప్రవేశించి 'నీడ తిరుగని చింత చెట్టుకు' ప్రదక్షిణ నమస్కారాలు చేసి, గరుడ స్తంభానికి సాగిలి మ్రొక్కాడు. సంపెంగ మ్రాకులతో తీర్చిన ప్రాకారము చుట్టి 'విరజానది'కి నమస్కరించాడు. స్వామికి నైవేద్యం పెట్టిన ప్రసాదాలను అమ్ముతున్నారు. బంగారు పళ్ళెరాలలో అమర్చిన భక్ష్య భోజ్యాలు, వెన్నగాచిన నేతితో వండిన ప్రసాదాలు, చింత చింత పచ్చళ్ళు, వెన్నెలగుజ్జు కుప్పవోసినట్లున్న దధ్యోజనాలు, అతిరసాలు, వడలు, అప్పాలు చూపరులకు నోరూరించేవి. పచ్చకప్పురపు వాసనలు గుప్పుమన కుంకుమపూవు, కస్తురి మొదలైన సుగంధ ద్రవ్యాల మేళవింపు నాస్వాదిస్తూ అన్నమయ్య నడగోపురం ప్రవేశించాడు. ఈ ప్రసాదాల తళిపల క్రింద ఒక రోజు స్రవించే నెయ్యి, మరొక దేవళంలో ఒక్క సంవత్సరానికి సరిపోతుందని, అబ్బుర పడుతూ బాల అన్నముడు స్వామి సన్నిధానము వైపు సాగాడు. 'భాష్యకారుల'నే ప్రసిద్ధ నామంతో వెలసిన రామానుజాచార్యుల మూర్తిని స్తుతించి, యోగ నరసింహుని దర్శించి, 'జనార్దనుని' (వరదరాజస్వామిని) సేవించి, 'వంట యింటిలో అలమేలుమంగకు' నమస్కరించి, 'యాగశాలను'

కీర్తించి ఆనంద నిలయ విమానమును చూచి మ్రొక్కాడు. కల్యాణమంటపమునకు ప్రణతులిడి, బంగారు గరుడ శేష వాహనములను దర్శించాడు. అక్కడ పునుగు చట్టలను తీర్చి, సలాకలకు గ్రుచ్చి కరగిస్తున్నారు. బంగారు వళ్ళెరాలలో చక్కెరలు పెట్టుకొని 'గోవింద గోవింద' అంటూ యాత్రికులు గుంపులు గుంపులుగ తిరుగుతున్నారు. 'వేంకటప్పకు మ్రొక్కుకోండి, కానుకలు వేసుకోండి, మీ కోరిన కోర్కెలు తీరుతాయని' పంచవన్నెల చిలుకలు పలుకుతున్నాయి. స్వామిభూషణాలు, వస్త్రాలు,అలంకారాలు ఉంచిన శ్రీ భండారమును చూచి బంగారుగాదెలను (హుండీ) సమీపించాడు. తన పంచె కొంగున ముడివేసుకొన్న కాసును వడ్డికాసులవానికి సమర్పించాడు. బంగారు వాకిళ్ళ చెంత చేరాడు. వేంకటేశ్వరుని తిరుమూర్తిని తనివిదీర దర్శించ సాగాడు. అందెలను సవదరించుకొన్న దివ్య పాదాలు. కనక పీతాంబరము. 'నా పాదాలను చేరినవారికి సంసార సాగరము మొలలోతే' అని సూచించే కటి. వరదహస్తాలు. బొడ్డులో మాణిక్యము, సూర్యకటారి, వక్షఃస్థలమందు అలమేలుమంగ, అటు వైపు భూదేవి ముద్దులు గారే ముఖమున విడివడని చిరునగవు. నొసట కస్తురి ముత్యాల నామము, మణిమయ కుండలాలు, ఆకాశరాజు అర్పించిన నవరత్న ఖచిత కిరీటము, అందముగ అలంకరించిన చెంగలువ పూదండలు,

వనమాల, శ్రీవత్సము, కౌస్తుభము, అనుపమ దివ్య భూషణాలు ఆ దివ్య మంగళ విగ్రహాన్ని కన్నుల కరవుదీర సేవించి పులకించి కీర్తించసాగాడు. ఆ బాలుని నోటి వెంట వెలువడే కీర్తనల వెల్లువకు అర్చకులు దిగ్భ్రమచెందారు. తీర్థ ప్రసాదాల నిచ్చి శఠకోపమిడి ఆశీర్వదించారు. అన్నమయ్య ఆ రాత్రి ఒక మండపంలో విశ్రమించాడు. అన్నమయ్య భక్తికి పులకించిన నిశాకాంత తారకల నానిష్కరించినది. గగన విష్ణువు పట్టిన అమృతకలశమో యన్నట్లు చంద్రుడుదయించాడు. అన్నమయ్యను అనురక్తితో చూచే హరి బింబంలా సూర్యోదయమైంది.

ఏకాదశినాడు అన్నమయ్య శ్రీచరణానురక్తుడై కొండ మీద దివ్యతీర్థాలను సేవించాడు. తారాకాసుర సంహారంతో బ్రహ్మహత్యాపాతకాన్ని పొందిన కుమారస్వామి తపము చేసి పాపము కడుగుకొన్న 'కుమారధార'ను దర్శించాడు. 'అమర తీర్థము'ను సేవించాడు. అంజనాదేవి తప మాచరించి ఆంజనేయుని కన్న చోటు, సకల పాపౌఘభంగ 'ఆకాశగంగ'ను, జనుల దోషాలను నీరుచేసే పతితపావనమైన 'పాపవినాశ' జలపాతాలను, పాండవ తీర్థాలను, ఉత్సాహంగా తిలకించాడు. ఆ తీర్థాలలో స్నానం చేస్తూ, కట్టుబట్టలు ఆరేటంతలో, వేంకటపతి మీద ఆశువుగ శతకాలను చెప్పేవాడు. పుణ్యతీర్థ సేవనోత్సాహముతో అన్నమయ్య వేంకటపతి దర్శనానికై

గుడికి వెళ్ళాడు. స్వామి బంగారు వాకిళ్ళు మూసి ఉన్నాయి. తలుపులకు బీగాలు వేశారు. అన్నమయ్య దీనభావంతో స్వామికి 'వేంకట శతకాన్ని' వినిపించాడు. శ్రీనివాసుని అనుమతికి నిదర్శనముగ తాళాలు తెగి పడ్డాయి. అర్చకులు ఆశ్చర్యమగ్నులయి అన్నమయ్యను స్వామి సన్నిధికి తోడ్కొనిపోయారు. రాములవారి మేడలో, సుగ్రీవ, హనుమ, అంగదాదులను, సీతారామలక్ష్మణులను దర్శించి, మ్రొక్కి, ముందు జగన్మోహనాకారముతో, సందడి సొమ్ములతో సాకారమై నిలిచిన శ్రీవేంకటేశ్వరుని సేవించాడు. అంగరంగ వైభవాలతో, చందనపుష్పమాల్యాదులతో, ధూపనీరాజనాలతో, వైదికోపచారములతో శ్రీనివాసుని పూజించే వైఖానస నంబి స్వామి అపరావతారంగ గోచరించాడు. ఆనంద తన్మయుడైన అన్నమయ్య 'వేంకట శతకాన్ని' తిరిగి వినిపించాడు ఆశ్రితకల్పకమై నిలిచిన వేంకటపతి మెడలో వ్రేలాడు ముత్యాలహారము పాదములపై పడినది. స్వామి ఆ భక్త కవిని అనుగ్రహించాడు. అర్చకులనుకున్నారు 'వీడు సామాన్యుడు కాడు. కోనేటిరాయని వరప్రసాదు'డని. వారనుగ్రహించిన చందన తీర్థ ప్రసాదాలను గ్రహించి కోనేటితటంలో భుజించాడు. ఆ రాత్రి ఆదివరాహస్వామి గుడిలో గడిపాడు.

తిరుమలలో ఘనవిష్ణుడనే ముని స్వామి కైంకర్యంలో ఉన్నాడు. అతడు నిష్ఠాగరిష్ఠుడు. సత్యవ్రతపాలకుడు. సాధుసత్త్వసంపన్నుడు. వేంకటరమణుడు ఆ మునికి కలలో కనిపించి "నా భక్తు డొకడు నా గుణసంకీర్తనము చేస్తూ రేపు నీ కడకు వస్తాడు. నల్లనివాడు. ముద్దులు మూటగట్టే రూపం. చెవుల్లో మద్దికాయ లుంటాయి. వట్టు కుచ్చులు తీర్చిన దండె భుజాన వేసుకొని ఉంటాడు. సంకోచించ కుండా ఆ బాలునికి ముద్రాధారణం చేయి; ఈ పనిని నాకు బదులుగ నీవు నిర్వహించు" అని తన ముద్రిక లొసగినాడు. స్వామి యానతి, యతి, బాలునికోసం శంఖచక్ర ముద్రలు పట్టుకొని నిరీక్షించసాగాడు. ఆ దినము ద్వాదశి. అన్నమయ్య స్వామిని దర్శించుకొని, సంకీర్తన చేస్తూ, కోవెల చుట్టు ప్రదక్షిణం చేసి. ఒక అరుగుపైన కూర్చున్నాడు. యజ్ఞశాల నుండి వెలుపలికి వచ్చిన యతి, సంకీర్తన తత్పరుడై భావ సమాధి మునిగిన అన్నమయ్యను చూశాడు. స్వామి చెప్పిన గుర్తులను పోల్చుకున్నాడు. ఆ ముద్దుల బాలుని తన చెంత చేర్చుకొని భగవదాజ్ఞను తెలిపి శంఖచక్రాదికములతో పంచ సంస్కారములు నిర్వహించాడు. అన్నమయ్య అన్నమాచార్యు డయ్యాడు. విష్ణుయతితో కలిసి వైష్ణవపంక్తిలో భుజించాడు.

అన్నమయ్య చెప్పా పెట్టకుండా తిరుమలకు వెళ్ళి పోయాడు. తల్లిదండ్రులు కన్నబిడ్డ కోసం వెదకి వెదకి,

కానక క్రుంగిపోయారు. లక్కమాంబ చెన్న కేశవుని గుడి వదలి రావడం లేదు. నారాయణయ్య వెర్రివాడిలా తిరుగుతున్నాడు. ఊరివారంతా అన్నమయ్య జాడ తెలుసుకోవడం కోసం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆనాడు ద్వాదశి. లక్కమాంబ వేంకటేశ్వరునకు ముడుపు కట్టినది. నారాయణయ్య వేంకటాచలము వైపు తిరిగి మాటి మాటికి దండాలు పెట్టసాగాడు. లక్కమాంబ హరినామకీర్తన చేస్తూ సోలిపోయింది. ఏదో మగతలో గొణగుతున్నది. 'తిరుమలప్ప... తిరుమలయ్య....అన్నమయ్య ...అన్నప్ప...'. నారాయణయ్యకేదో స్ఫురించింది. లక్కమాంబను పిలుచుకొని తిరుమలకు బయలుదేరాడు.

అన్నమాచార్యుడు కొండలయ్యను సేవిస్తూ విష్ణుయతి వద్ద వేంకటేశ్వర తత్త్వాన్ని తెలుసుకొంటున్నాడు. ఆళ్వారుల జీవితాలను, వారి పాశురాలను అధ్యయనం చేస్తూ, భక్తి తత్త్వాన్ని అవగాహనం చేసుకొంటున్నాడు. గురువు బోధనలను మననం చేసుకొంటూ తిరు వీథులలో ఏదో పాడుకుంటూ తిరుగుతున్నాడు. అన్నమయ్య గానం చేస్తూంటే, పిన్నలు పెద్దలు చుట్టుకొనేవారు. తిరుమల యాత్రికులకు అన్నమయ్య పాట ఒక ప్రత్యేక ఆకర్షణ. అన్నమాచార్యుడు ఘన విష్ణువు వద్ద అధ్యయనం ముగించుకొని శ్రీనివాసుని దర్శించుకొని గుడిముందు మండపంలో

కూర్చొని హరి సంకీర్తన చేస్తున్నాడు. యాత్రికులు పార వశ్యంతో వింటున్నారు. తిరుమల చేరుకున్న లక్కమాంబ, నారాయణసూరి కుమారుని కంఠం గుర్తుపట్టారు. వాళ్ళ సంతోషానికి అవధుల్లేవు. లక్కమాంబ 'అన్నా' అంటూ ఆ గాయకుని వద్దకు పరుగెత్తింది. అమ్మ పిలుపు విన్న అన్నమాచార్యుని గానం ఆగిపోయింది. 'తల్లీ' అంటూ లక్కమాంబ ఒడిలో వాలిపోయాడు. నారాయణయ్య ఆనందంగా, గర్వంగా తనయుని అక్కున చేర్చుకొన్నాడు. అన్నమాచార్యునిలో ఏర్పడిన మార్పును గమనించాడు. ద్వాదశ పుండ్రాలతో, మూర్తిగొన్న వైష్ణవ తేజస్సుతో విరాజిల్లుతున్నాడు అన్నమాచార్యుడు. నారాయణయ్య 'స్వామీ! వేంకటేశ్వరా! వీడు నీ వరప్రసాదం. నీవే కాపాడుకో' అన్నాడు ఘనవిష్ణువు వాళ్ళను తన ఆశ్రమానికి తీసుకొని వెళ్ళాడు.

లక్కమాంబ అన్నమాచార్యుని తాళ్ళపాకకు రమ్మంటున్నది. అన్నమాచార్యుడు 'పెరుమాళ్ళను వదలి నేనెలా రానం'టున్నాడు. తల్లి పట్టిన పట్టు వదలలేదు. అన్నమయ్య వేంకటపతి సన్నిధిని వీడలేడు. నారాయణయ్య కేమి పాలు పోలేదు. ఘనవిష్ణువు ఏమీ పలుకలేదు. అన్నమాచార్యుని మనసు డోలాయమానమైనది. ఆ రాత్రి తిరుమల ప్రభువే ఈ సమస్యను పరిష్కరించాడు అన్నమాచార్యునికి స్వప్న

ప్రబోధం జరిగింది. "అన్నా! తల్లి మనసు కష్టపెట్టకు. నన్ను మరువకు. తాళ్ళపాకకు వెళ్ళిరా. నేను నీ వెంటే ఉంటాను. పరచింతలు మాను. పరతత్త్వం తెలుసుకో". అన్నమాచార్యుడు స్వామి ఆదేశాన్ని విష్ణుయతికి తెలిపాడు. తల్లి దండ్రులతో కలసి తాళ్ళపాక చేరుకున్నాడు. తాను ప్రత్యక్షంగా అనుభవించిన తిరుమల వైభవాలను, ఊరి వారికి పాటలు చేసి వినిపించాడు. వేంకటేశ్వరస్వామి మాహాత్మ్యాన్ని కథలల్లి చెప్పాడు. దండె మీటుకుంటూ, చుట్టూ ఉన్న గుళ్ళూ గోపురాలు తిరుగుతూ, భజన గోష్ఠులు నిర్వహించేవాడు. ఏవో రాగాలను మననం చేసుకుంటూ, లయబద్ధంగా వ్రేళ్ళు లెక్కించేవాడు. జానపదులు పాడే పాటలను మరీ మరీ పాడించుకొని వినేవాడు. కొంత తడవు ధ్యానంలోనే మూగగ రోదించేవాడు. అర్థాంతరంగా నవ్వే వాడు. శరీరమంతా ఊర్ధ్వపుండ్రాలతో, దండె భుజాన తగిలించుకొని పాడుకుంటూ, ఊరూ, వాడ తిరిగే అన్నమా చార్యుని జీవయాత్ర, ఇంటా బయటా అందరికీ ఒక ఆశ్చ ర్యంగా మిగిలిపోయింది.

అన్నమాచార్యునికి నవయౌవనం అంకురించింది. తల్లిదండ్రులు వివాహ ప్రయత్నాలు చేయసాగారు. ఎప్పుడూ రాగాలు తీస్తూ తిరిగే నామాల దాసరయ్యకు పిల్లనివ్వడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. చూస్తూ చూస్తూ గుళ్ళ

గోపురాలు తిరుగుతూ ఇంటి ముఖమే చూడని సన్యాసికి బిడ్డ నెవ్వరిస్తారు. నారాయణయ్యకు తన కొడుకు పెళ్ళి ఒక సమస్యగ తయారైనది. అన్నమాచార్యుని విరక్తి రక్తి మార్గంలో పడడానికి దైవమే పూనుకున్నాడు. శ్రీనివాసుని సంకల్పంవల్ల అన్నమాచార్యుడు తిమ్మక్క, అక్కలమ్మ అనే ఇద్దరు కన్యలను వివాహమాడవలసి వచ్చినది. అన్నమాచార్యుని గృహస్థాశ్రమధర్మం శ్రీనివాస భక్తి సామ్రాజ్యానికి పునాదులు వేసినదే కాని అవరోధం కాలేదు. ఆ తవస్వి సంగీత సాహిత్యాలనే రెక్కలతో, భక్తి అనే గగనమార్గంలో క్షీరసాగరశయనుని కోసం వెదకసాగాడు. సహధర్మచారిణు లిరువురు అన్నమాచార్యుని జీవిత వ్రతానికి తోడు నీడగ నిలిచారు.

అన్నమాచార్యునికి పదహారేండ్లు నిండాయి. తిరుమలలో స్వామి సన్నిధిలో తన జన్మ నక్షత్రం నాడు గడపదలిచాడు. సతులు అక్కలమ్మ తిమ్మక్కలు కూడా ఉన్నారు. స్వామి సుప్రభాత సేవ చేసుకొని వరాహ స్వామి సన్నిధి వద్ద మండపంలో సంకీర్తన సేవలో ఉన్నాడు. అర్ధ నిమీలిత నేత్రాలతో ఏదో రాగ మాలపిస్తున్నాడు. ముఖారి రాగం అందుకొంది అతని మనోనయనాలకు ఏవో బొమ్మలు గోచరిస్తున్నాయి. "సత్యలోకము నుండి బ్రహ్మ దేవుడు దిగి వచ్చి శ్రీనివాసుని దివ్య పాదాలను ఆకాశగంగతో కడుగు

తున్నాడు. వామన త్రివిక్రమ రూపాలు కనిపిస్తున్నాయి. భూమ్యాకాశాలను కొలిచే స్వామి పాదాలు. బలిచక్రవర్తిని పాతాళానికి త్రొక్కి అమరేంద్రుని కభయమిస్తున్న శ్రీపాదాలు. పాపము చేసి పాషాణమై పడి ఉన్న అహల్యకు శాపమోచనం కలిగించిన శ్రీరామ పాదాలు. కాళింగుని పడగల మీద అందంగ నృత్తమాడే చతురనటమూర్తి గోపాల చక్రవర్తి చిరుపాదాలు. ఆదిలక్ష్మి గోముగా ఒత్తే శేషశాయి పాదాలు. తిరుమల శిఖరాలను ఊది నిలిచి, పరమ పదాన్ని చూపే వేంకటపతి పాదాలు. "బ్రహ్మ కడిగిన పాదము! బ్రహ్మము తానె నీ పాదము" పల్లవి, చరణాలతో పదం అవతరించింది. తాళగతిని చూపే యతి ప్రాసలతో కీర్తన పెల్లుబికింది. భక్తి భావంతో సంగీత సాహిత్యాల సౌహార్దంతో, రాగతాళాల పాద పీఠంతో, సంకీర్తన సరస్వతి ఆవిర్భవించి, శ్రీనివాసునికి దివ్య పాదాలలో పూజా కుసుమమై నిలిచింది. "సంకీర్తనాచార్య! నీవు పదకవితా పితామహుడవైనావు. అహంకృతికి లోనుగాక అలంకృతి, చమత్కృతి, జీవ గర్రగ నామీద రోజుకొక సంకీర్తనకు తక్కువ కాకుండ వినిపించవయ్యా! నీ కృతులు తెలుగు వేదాలై విరాజిల్లుతాయి" అన్నమాచార్యుడు వెంకటపతి దివ్యమంగళ రూపాన్ని చూస్తూ, భగవద్వాక్యాలను ఆలకిస్తూ మైమరచి పోయాడు. ఆ తిరువేంకటనాథుని ఆదేశం, అన్నమాచార్యుని సంకీర్తనోద్య

మానికి శ్రీకారమైనది. అతని హృదయం నుండి పుంఖాను పుంఖంగ సంకీర్తనలు వెలువడినవి. ఆ కృతులను తాళ పత్రాల కెక్కించే శిష్యకోటి తయారైంది. తిరుమల దివ్య శక్తి యిచ్చిన స్ఫూర్తితో, అన్నమాచార్యుడు సంకీర్తన వ్యాప్తికి దేశ సంచారం చేశాడు. తెలుగునాట వెలసిన దివ్య దేశాలను తన సంకీర్తన యజ్ఞానికి కేంద్రాలుగ చేసు కొన్నాడు.

తాళ్ళపాకలో ఉన్న అన్నమాచార్యులకు శఠకోప యతుల గురించి తెలియవచ్చింది. ఆ అహోబలమఠ యతు లను దర్శించడానికి పూనుకొన్నాడు. ఇద్దరు సతులతో ఆచార్యుల వారు తీర్థయాత్రకు బయలుదేరారు. ఊరి చెన్న కేశవుని అర్చించి, నెందలూరు సౌమ్యనాథుని, ఒంటిమిట్ట రఘురాముని, కడప వేంకటరమణుని, చాగలమర్రి చెన్న కేశవుని సేవిస్తూ అహోబలం చేరుకున్నాడు. అహోబలం స్వయం వ్యక్త క్షేత్రం. ఈ నల్లమల అడవులలో వెలసిన నరకేసరి అగణిత మహిమలు గల వేల్పు. తిరుమంగై ఆళ్వారు కీర్తించిన ప్రహ్లాదవరదుడు అహోబలంలో నిలిచిన భక్త సంరక్షకమూర్తి. నవనారసింహ రూపాలతో ఆవిర్భ వించిన ఈ క్షేత్రం ఎందరో మహాభక్తులకు ఆశ్రయమిచ్చి నది. చెంచులక్ష్మితో నరహరి చెట్టపట్టాలు వేసుకొని, చెట్టూ పుట్టా తిరిగిన చోటిది. భవనాశినీ జలాలలో, జలపాతాలలో,

చెంచెత అందాల పొంగులలో ఆ మగసింహం ఓలలాడిన తీర్థమిది ఉగ్ర స్తంభం చీల్చుకొని జ్వాలానృసింహుడై కనక కశిపుని వధించి ప్రహ్లాదుని రక్షించిన పుణ్యప్రదేశ మిది. అన్నమాచార్యుడు ఈ క్షేత్రాన్ని, దైవతాన్ని, తీర్థాన్ని తన సంకీర్తనలతో అభిషేకించి, అహోబల మఠ స్థాపనాచార్యులైన ఆదివణ్ శఠకోపయతుల వద్ద సకల వైష్ణవాగమాలను అధ్యయనం చేశాడు. శఠకోపయతులు మేల్‌కోటలో అవతరించిన పుణ్యపురుషులు. వీరికి అహోబల నరసింహస్వామి సాక్షాత్కరించి స్వయంగ సన్యాసాశ్రమాన్ని అనుగ్రహించారట. మఠ, మహానస వాసులకు సమానంగ వైష్ణవ దీక్షను ప్రసాదించిన ఉదాత్త ప్రేమమూర్తి శఠకోపయతి. జాతి, మతం, కులం పామరత్వంతో ఏర్పరచుకొన్న అడ్డుగోడలని, వైష్ణవ ధర్మసూత్రాలతో వానిని బద్దలు గొట్టి, ప్రాణికోటిని ముక్తి మార్గంలో నడిపిన మహాయతి. అన్నమాచార్యుని ఆలోచనా విధానమే ఈ గురుదేవుని బోధనల వల్ల మారిపోయినది. ఆ దొరమునిని సంకీర్తన కుసుమాలతో అర్చించాడు. ఆచార్యుని ప్రబోధాలను అన్నమాచార్యుడు తేటతేట పలుకులలో వినిపించాడు. 'మదమత్సరము లేక మనసు పేదైపో, వదలిన యాసనవాడు వో వైష్ణవుడు', 'వలెనన్నవాడె పో వైష్ణవుడు, వలపు తేనె పో వైష్ణవమని' మధురమైన నిర్వచనాలు చేశాడు. 'సహజ వైష్ణవాచార

వర్తనుల సహవాసమే మా సంధ్య' అని తన నిష్కల్మష మైన మనస్తత్వాన్ని ఆవిష్కరించాడు. రామానుజుల విధానాన్ని, వేదాంతదేశికుల స్ఫూర్తిని, శఠకోపయతుల ఆశయాన్ని అన్నమాచార్యులు తన సంకీర్తనల ద్వారా తెలుగు నేలలో స్థాపించాడు.

అన్నమాచార్యుల సంకీర్తనలు విశేష ప్రచారాన్ని పొందుతున్నాయి. దక్షిణాపథంలో ఉన్న వైష్ణవాలయాలను, పాదయాత్ర చేస్తూ, దర్శించాడు. ఆయా వేల్పులను కొని యాడుతూ విష్ణుతత్త్వాన్ని బోధించేవాడు. ప్రజలు అన్నమా చార్యుని పాటలంటే తండోపతండాలుగ గుమిగూడేవారు. ఇతని కీర్తనలు పండితులను, పామరులను సమానంగా ఆకర్షించేవి. కవులు, గాయకులు,నాట్యకళాకారులు ఆ పదాలను ప్రశంసించారు. భజనగోష్ఠులలో అన్నమాచార్యుని సంకీర్తనలే ప్రధానం. అన్నమాచార్యుని కృతులు బహు జనాదరణ పొందడానికి కారణం భావం, భాష, ప్రక్రియ. ప్రక్రియ అంటే అది పాట కావడం. పద్యం వేరు, పదం వేరు. పద్యాలలో శబ్దార్థాల ప్రమేయ మెక్కువ. పదంలో శబ్దార్థాల తీర్పుతోబాటు గానం ప్రధానం. సంగీతం ఆపాత మధుర మైనది. పద్యాలలో గానధర్మం ఛందస్సులో లయమై ఉన్నా, అవి నామమాత్రావశిష్టమే. పాటలో రాగతాళాలు రాజ్యం చేస్తాయి. అన్నమాచార్య సంకీర్తన విలక్షణమైన సంగీత

ప్రక్రియ. పల్లవి చరణాలతో, రాగతాళాల సౌహార్దంతో నిండుగ సాగే అన్నమాచార్య సంకీర్తన సకల జనసమ్మోహకరమైనది. అన్నమాచార్యుని పాట అందరికీ అర్థమయ్యే భాషలో రచింపబడ్డది. లోకంలో సర్వసాధారణంగా అందరూ వ్యవహరించే భాష అది. సహజమైన పలుకుబళ్ళతో, నానుళ్ళతో, నుడికారపు సొంపుతో విలసిల్లేది. కేవల నిఘంటు సిద్ధమైన పదజాలం మీద అతనికి ఆసక్తి లేదు. తనకున్న పాండిత్యాన్ని ప్రదర్శించే సమాసభూయిష్ఠమైన రచన జోలికి పోలేదు. ఆ పాటలు వింటూనే అర్థం గోచరించి, ఆనందాన్ని కలిగిస్తాయి. భాషా సారళ్యం, సౌందర్యంతోబాటు అందలి భావ సౌందర్యం అసామాన్య మయినది. ప్రజలను భక్తి మార్గంలో పయనించేటట్లు చేయవలె. ఆ మార్గం ఇహపర సాధకం. ప్రజలు పరోపకార పరాయణత్వం, భూతదయ కలిగి జీవయాత్ర సాగిస్తూ శాశ్వతమైన పరమాత్మ సాయుజ్యాన్ని పొందాలనే అన్నమాచార్యుని తపస్సు. గురువు - రహస్యమని చెప్పినా, మానవ కల్యాణం కోసం శ్రీరంగ గోపురమెక్కి ఎలుగెత్తి శరణాగతి మంత్రాలన్నీ అందరికీ వినిపించిన రామానుజాచార్యులే అన్నమాచార్యునికి ఆదర్శం. తేట తేట పలుకులతో, పరమాత్మ తత్త్వాన్ని మానవులకు బోధించడానికి పాశురాలను పాడిన, ఆళ్వారుల అడుగుజాడలలో నడచినవాడు. శ్రుతులను, స్మృతులను,

పురాణాలను, ఇతిహాసాలను, సమకాలీన సాంఘిక అనుభవాలను, పురస్కరించుకొని తన పదాలలో తెలుగు వేదాన్ని వినిపించిన పుణ్యపురుషు డితడు.

అన్నమాచార్యుని సంకీర్తనలు శృంగార అధ్యాత్మ వీథులలో నడచిన దీపకళికలు. శరణాగతి తత్త్వాన్ని బోధిస్తూ, మధుర భక్తి సంప్రదాయాన్ని వివరిస్తూ శ్రీవేంకటేశ్వర భావ సామ్రాజ్యాన్ని స్థాపించాయి. అన్నమాచార్యుడు సంప్రదాయ గౌరవంతోబాటు, సన్నివేశ చమత్కారమును కూడ సాధించి తానిక నవ్యమార్గాన్ని పాదుకొల్పాడు. జనపదాలకు, జానపద కళా రీతులకు గౌరవాన్ని, కావ్యత్వసిద్ధిని కలిగించాడు. ప్రజలు, పాలకులు అన్నమాచార్యుడు మహా భక్తుడని, కవీశ్వరుడని, గాన కళాకోవిదుడని వేనోళ్ళ పొగడసాగారు. టంగుటూరును పాలించే విద్యానగర దండనాథుడు, సాళ్వనరసింగరాయలు అన్నమాచార్యుని కీర్తి ప్రతిష్ఠలను విన్నాడు. ఆ మహా భాగవత దర్శనానికి ఉవ్విళ్ళూర సాగినాడు.

సాళ్వ నరసింగరాయలు విద్యానగర రాజప్రతినిధి, దండనాథుడు. సాళ్వ అనేది బిరుద నామం. తర్వాత అది ఇంటిపేరుగా నిలిచిపోయింది. టంగుటూరు తాళ్ళపాకకు సమీపంలో ఉన్న ప్రాంతం. అక్కడ చెన్నకేశవాలయం

ప్రసిద్ధమయింది. ఆ సీమ రాజకీయాలకు టంగుటూరు కేంద్ర స్థానం. సాళ్వ నరసింగరాయలు గొప్ప రాజకీయ వేత్త. ఉత్తరోత్తర ఆ రంగంలో అభివృద్ధి సాధించడానికి కృషి చేసేవాడు. తన స్వీయ పౌరుషంతోబాటు దైవబలం కూడ తోడ్పడవలెననే విశ్వాసం గల వ్యక్తి. అన్నమాచార్యుని ఉద్యమ మతనికి నచ్చినది ఆ శ్రీనివాసదాసుని అనుగ్రహము కోసం తాళ్ళపాకకు వెళ్ళాడు. అన్నమాచార్యుని దర్శించి వెలలేని కానుకలు సమర్పించాడు. టంగుటూరుకు విచ్చేసి గురువుగ, తోడు నీడగ నిలచి ఆశీర్వదించమని ప్రార్థించాడు. అన్నమాచార్యుడు నరసింగరాయని నిజాయతీని మెచ్చి అంగీకరించాడు. చెన్నకేశవ మందిర ప్రాంతంలో రాజభవనానికి సాటి వచ్చే నగరును ఆచార్యునికి నిర్మింప చేశాడు. భగవత్కైంకర్యానికి అవరోధం కలుగనంత వరకు రాజుతో ఉంటానని మాట యిచ్చాడు నరసింగరాయని ఆదరణ అభిమానం తన సంకీర్తన సేవకు, వేంకటేశ్వర తత్త్వ వ్యాప్తికి ఉపకరిస్తుందని భావించాడు. అన్నమాచార్యుని ఆశీర్వాదబలం వల్ల, తన శక్తియుక్తుల వల్ల నరసింగ రాయలు పెనుగొండ ప్రభువయ్యాడు. అన్నమాచార్యునికి పెనుగొండకు పోక తప్పలేదు. కన్నడదేశములో సంచరించడానికి, కర్ణాటక హరిదాస కూటాలతో సంబంధం పెంచుకోవడానికి, చక్కని అవకాశ మేర్పడినది. సాళ్వ నరసింగ

రాయలు అన్నమాచార్యుల అన్యోన్యత రాజాశ్రయములోని పరివారానికి కొంత అసూయను కూడ కలిగించినది. నరసింగ రాయలు దండయాత్రలకు బయలుదేరినా, రాజకీయ రహస్య మంత్రాలోచనలు చేసినా, అన్నమాచార్యుని సాన్నిహిత్యము వీడరానిదే. రాజు కొలువు కొంత ఆచార్యుల వారి ఉద్యమానికి దోహదము చేయకపోలేదు. అది శాశ్వతము కాదని తెలుసు కొనుట అన్నమాచార్యునికి ఎంతో కాలము పట్టలేదు.

సాళ్వ నరసింగరాయలు విజయోత్సవాల సందర్భంగా అన్నమాచార్యుని కొలువుకు ఆహ్వానించాడు. అప్పుడప్పుడు రాజు అన్నమాచార్యుని పాటలను కొలువులో వింటూ ఉండేవాడు. సంకీర్తనాచార్యుని పర్యవేక్షణలో గాయకులు గానం చేసేవారు. కాళిదాసాదుల కవితా రసపుష్టితో మోహన మూర్తులై విలసిల్లే ఆ పదాల భావగీతీ సౌరభాలకు అలరి రాజు అన్నమాచార్యుని సార్వభౌమోచితంగా సత్కరించాడు. ఛత్రచామరాదులను ఆ భక్తకవికి ప్రత్యేకంగ అర్పించాడు. పదకవితా పితామహుడు ఆనాడు రాజు కొలువుకు విచ్చేశాడు. ఆచార్యుడు మూర్తీభవించిన వైష్ణవ తేజస్సుతో ప్రకాశిస్తు న్నాడు. హరి కీర్తి మొలకలెత్తినవో అన్నట్లు ద్వాదశ ఊర్ధ్వపుండ్రాలతో, భక్తికాంత వరించిన మాలికలా పవిత్రము, తులసి పద్మాక్షమాలలు తిరుమణి

త్రావడంబులు ధరించి, తలమీద ధరించే విష్ణుపాదపు తామరపువ్వులా పట్టు కుళ్ళాయి (ప్రపన్న పాగ) పెట్టుకొని, శ్రీమన్నారాయణుని దయామృతధారలా వ్యాపించిన కంఠ మాలికను వేసుకొని, వేంకటపతి కోసం కంకణం కట్టు కొన్నట్లున్న పచ్చల కడియాలతో, శోభావిలాసం వాసం చేస్తున్నట్లున్న పేరణము ధరించి, శ్రీనివాసుని ఆజ్ఞానుసారం చుట్టుకున్న సత్త్వగుణమో అన్నట్లున్న శాలువా కప్పుకొని, పల్లకి నెక్కి సంకీర్తనపరులిరుగడల సేవింపగా, శంఖధ్వానం వ్యాపించగా, ఆస్థానమండపం వద్ద దిగి, వెంటనంటి ఉన్న వైష్ణవుని భుజం మీద చేయి వేసుకొని, రాయలు కొలువు ప్రవేశించినాడు అన్నమాచార్యుడు. సాష్టాంగ దండప్రణా మాలు చేసిన రాజును ఆశీర్వదించి, బంగారు సింహాసనాన్ని అధివసించాడు. రాజు కోరిక మన్నించి, అన్నమాచార్యుడు మధురభక్తి పరిమళించే శృంగార పదాన్ని వినిపించాడు. "ఏమొకో చిగురుటధరమున యెడ నెడ కస్తురి నిండెను భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు గదా". ఆ పదంలో భావ మిది: 'అలమేలుమంగ శ్రీనివాసుని పడకటిల్లు వదలి వెలుపలికి వచ్చినది. చెలికత్తెలు ఆమెను నఖశిఖపర్యంతం తనిఖీ చేస్తూ మట్లాడుకొంటున్నారు చిగురు టధరమున కస్తురి అంటినది - అది ప్రియురాలు ప్రియునకు వ్రాసిన ప్రేమలేఖ కనుకొలుకులు ఎర్రవారినవి - ప్రియుని ఎదలో

గ్రుచ్చిన చూపుల బాణాలు వెనక్కు లాగడంవల్ల అంటిన నెత్తురు ఆమె కనుగవ మెరుగులు పైకి చిందినవి-ప్రియుడు ఒత్తిన నఖశశిరేఖలు (నఖక్షతాలు) వెదలించిన వేసవికాలపు వెన్నెల, ఆమె చెక్కిళ్ళలో జారే ముత్యాల జాలరులు - అవి శ్రీనివాసుడు కామిని వదనాన అద్దిన సురతపు చెమటల అందము." ఇలా సాగిందా పాట. ఆ పాట రాజును మైమర పించినది. అందలి భావాన్ని మాటిమాటికి నెమరువేస్తూ 'ఇదీ కవిత్వం' అని మెచ్చుకొన్నాడు. సరససాహిత్యవేత్త అయిన సాళ్వ నరసింగునిలో గర్వం పొడచూపినది, లోభం చోటు చేసుకొన్నది. తన ప్రభుత్వము గుర్తుకు వచ్చినది. రాజు అన్నమాచార్యుని మహిమలను ప్రత్యక్షముగ అనుభ వించినవాడే. అయినా ఎందుకో అతనిని సామాన్య గాయ కునిగా భావించాడు. 'ఇటువంటి పదాన్ని ఒక్కటి నా మీద కూడ వినిపించవయ్యా' అన్నాడు. అన్నమాచార్యుని కళ్ళ ఎదుట వేంకటాచలం క్రుంగిపోయినట్లైనది. రెండు చెవులు మూసుకొని 'హరిహరీ! ముకుందుని కొనియాడే నా జిహ్వ మిమ్మల్ని స్తుతించలేదు. రాజా! ఎంత నీచమైన కోరిక ఇది. నరహరి కీర్తన నానిన జిహ్వ బరుల నుతింపనేరదు. నీకు, నీ కొలువుకు నమస్కారము' అని అన్నమాచార్యుడు ఆసనము దిగి సభానిష్క్రమణం చేశాడు. నరసింగుని అధికారం పాతాళానికి క్రుంగినట్లైనది. నిండుసభలో ఒక

సంకీర్తనపరుడు తిరస్కరించడం సహించలేకపోయాడు. రాజధిక్కారం కావించినాడని కోపంతో బుసలుకొట్టాడు. భటులను పిలిచి అన్నమాచార్యునికి 'మూరురాయరగండ' సంకెల బిగించి చెరసాలలో వేయించాడు.

అన్నమాచార్యునికి వాస్తవము గోచరించినది. శాశ్వత సత్యాన్ని, అశాశ్వతమైన ఆవరణలలో తెలుసుకోలేము. రాజాశ్రయాలు భక్తులకు ఉచితము కాదు. మనిషిగా పుట్టి మనుష్యుని సేవించడం దుఃఖదాయకము. 'శ్రీవేంకటేశ్వరుని సేవారతికి గాక జీవన భ్రాంతిపడు సిరులేల' అనుకున్నాడు. మృగంగ, చెట్టుగ, పుట్టగనైన పుట్టవచ్చుగాని ఇతరులను సేవించ రాదన్నది అతని తీర్మానం. శ్రీనివాస తత్త్వప్రచారానికి తోడ్పడుతుందనుకొన్న రాజు చెలిమి తన జీవిత వ్రతానికే అవరోధమౌతుందని ఊహించని అన్నమాచార్యుడు పశ్చాత్తాప హృదయంతో వేంకటపతి చరణాలను శరణుజొచ్చాడు. సత్కారము చేసిన రాజసభ అవమానము చేసినది. స్వర్ణకంకణాలు తొడిగిన రాజరికము మూరురాయర గండ సంకెల బిగించినది. "గజేంద్రుని కాపాడిన వేల్పువు, ద్రౌపది మానము కాచిన దేవుడవు. హరి పూజకు వేళైనది. సంకీర్తన పూజ ఈ సంకెళ్ళతో ఎలా నిర్వహించేది. నీ దాసుల భంగము నీవు చూతువా ! ఏ రీతి పరాకు నీకు

నను రక్షింపరావా!" అని అన్నమాచార్యుడు దీనాతిదీనంగ ఆలపించాడు. హరికీర్తనాచార్యుని చేతులకు సంకెల బిగించిన సంకీర్తనే ఆ సంకెళ్ళను తెంచినది. అధికారమదము వేసిన శృంఖలలు హరికీర్తనచే తెగి నేలపడ్డవి. రాయ లదిరిపడి 'నేను నమ్మ ననుచు' ఆచార్యుని చేతులకు తిరిగి సంకెళ్ళు వేయించాడు. 'నీ మాయలు నా వద్ద సాగవు. ఇప్పుడు పాడి తెంచుకో చూద్దాం' అని ఎకసక్కెం చేశాడు. మత్తెక్కిన రాజు మాటలు విని అన్నమాచార్యు డుదాసీనుడైనాడు. "నరసింగా! వేంకటపతి కీర్తన పరమ మంత్రం. దాని మహిమ తెలియతరమా" అని సంకీర్తన గానం చేశాడు. పెనుగొండ నగరంలో ప్రకంపనలు చెలరేగినవి. రాయలు కిరీటం, మూరురాయరగండ సంకెళ్ళు ఆచార్యుని చరణము లపై వాలిపోయినవి. నరసింగుని అహంకారము హరిదాసుని పదములపై పడిపోయినది. 'అపరాధిని, అపరాధిని కృప గల దేశికునివి నన్ను క్షమించు. నీవు మా పాలిట వేంకట పతివి. నీ కృప శ్రీనివాసుని కృప. నీ కోపం వేంకటపతి కోపం అంటూ రాజు పట్ట మహిషితో కలసి ఆచార్యుని చరణాలను పన్నీట కడిగి సువర్ణ పుష్పాలతో పూజించాడు. కనకాంబరాలు, మణిభూషణలు సమర్పించి తానెక్కి తిరిగే పసిడి అందల మెక్కించి ఆ పల్లకి కొమ్ముకు తన భుజాన మోశాడు. అన్నమాచార్యుడు ప్రసన్నుడై "రాజా!

భగవంతుడు కృత యుగంలో ధ్యాన తపజపాలతో, త్రేతా యుగంలో క్రతువులతో, ద్వాపరమున అర్చనలతో, కలి యుగాన సంకీర్తనలతో తనివి చెందుతాడట. హరికీర్తన పరులను అవమానించవద్దు. తన దాసులను భక్తితో సేవిస్తే వేంకటపతి అనుగ్రహిస్తాడు. "శ్రీనివాసోరక్షతి" అంటూ ఆ హరిభక్తుడు రాజును వీడ్కొని తిరుమల సార్వభౌముని కొలువు చేరినాడు.

"వేంకటపతీ! లౌకికబంధాల నుండి విముక్తి కలిగించు. వెన్న చేత పెట్టుకొని నేయి కోసం వెదకి వేసారినాను. ఏరు విడిచి కాలువ పొగడి మోసపోయాను. విడువ విడువ ఇక నీ పాదములు. దీనుడ నేను. దేవుడవు నీవు విడువలేని శ్రీవేంకట విభుడవు. కడదాక నన్ను కాతువుగాక!" అని అన్నమాచార్యుడు స్వామి ఏకాంత సేవలో ప్రార్థించాడు. ఆచార్యుని మనసులో శ్రీనివాసుని సేవించి తరించిన మహా భక్తులు, భాగవతోత్తములు గోచరించారు. పుట్టలో వెలసిన శ్రీనివాసునికి నిలువ నీడ కల్పించిన తొండమాన్ చక్రవర్తి. బంకమట్టి పువ్వులతో పూజించి శ్రీపతి సాయుజ్యాన్ని పొందిన కుమ్మరి భక్తుడు కురవనంబి. స్వామికి అభిషేక జలాన్ని పాపవినాశంనుండి అనుదినం తెచ్చిన తిరుమలనంబి. అలమేలుమంగ పతికి ఆలవట్ట కైంకర్యము చేస్తూ స్వామితో ప్రత్యక్షంగ సంభాషణ నెరపిన తిరుక్కచ్చినంబి.

శ్రీనివాసుడు విష్ణుమూర్తి యని సోపపత్తికంగా స్థాపించి, ప్రత్యక్షంగ నిరూపించి, ఆలయ పూజా విధులను, కట్టు దిట్టాలను చేసిన భాష్యకారులు రామానుజాచార్యులు. ఈ ఆచార్యుని చేతులమీదుగనే శ్రీనివాసుడు తిరిగి శంఖచక్రాలను స్వీకరించాడట. స్వహస్తాలతో తటాకాన్ని త్రవ్వి స్వామికి, పుష్పకైంకర్యంచేసింది అనంతాళువారు. అన్నమాచార్యులు పెద్దలిచ్చిన నిధిని కనుక్కొన్నాడు. తన విధులనూ తెలుసు కున్నాడు. నమ్మాళ్వారు 'తిరువాయ్‌మొళి'ని అధ్యయనం చేశాడు. ఆలయ పూజా విధులలో సంకీర్తనకు చోటు కల్పించాడు. వేంకటపతి సేవా కార్యక్రమాలను వివరించే సంకీర్తనలను వందలకొలది గానం చేశాడు. ఉత్సవాలను, ఊరేగింపులను తెలిపే పాటలెన్నో రచించాడు. ఆలయ సంప్రదాయాలలో కల్యాణోత్సవాన్ని పాదుకొల్పాడు. తాను కన్యాదాతగ అలుమేలుమంగా శ్రీనివాసుల కల్యాణాన్ని జరిపించేవాడు. సుప్రభాత సేవ మొదలు, ఏకాంత సేవదాకా, సంకీర్తన సేవలు నిర్వహించేవాడు. అన్నమాచార్యుని పాటలు విని స్వామి నిద్ర లేచేవాడు. పన్నగపు దోమతెర తొలగించి అలమేలుమంగ ముఖారవిందాన్ని తిలకించి, అన్నమాచార్యుని తన కటాక్షాలతో అనుగ్రహించేవాడు. ఆచార్యుని జోలపాట వింటూ స్వామి యోగ నిద్రలో జారుకొనేవాడు. ఈ భక్తుడు అందించిన బంగారు గిన్నెలోంచి పాలు ఆరగించేవాడు.

సంకీర్తనాచార్యుని పాటలకు పరవశించి అలమేలుమంగతో కలసి వేంకటపతి నాట్యమాడేవాడు. వేదముతో, ద్రవిడ వేదముతో అన్నమాచార్యుని తెలుగు వేదం, ఆలయ పూజా విధులలో దిట్టము చేసుకొన్నది.

అన్నమాచార్యుని శృంగారమంజరి, శృంగార పదాలను విని పరవశించిన తిరుమల దేవుడు "అన్నా! వకుళమాలిక జోల విని పసిబిడ్డనైనాను. కృష్ణమాచార్యుని అధ్యాత్మ కృతులు విని విరక్తుడనైనాను. నీ పదాలు వింటూ నేను నిత్యయౌవనుడనైనాను. మరెవ్వరి కృతులు వినదలచుకో లేదయ్యా" అనగా ఈ భక్తుడు "వేంకటాచలపతీ! మిమ్ము వేదాలు వినుతించాయి. నిత్య సూరులు స్తుతిస్తున్నారు. సురలు మీ నామజపంలోనే గడుపుతున్నారు. నేనెంత.నాయోగ్యతెంత. పాలుపోసి పెంచిన నా పాలి వేంకటేశ! నేను తోలుబొమ్మను సుమీ!" అని సంకీర్తన కుసుమాలతో అర్చించ సాగాడు. శ్రీనివాసుడు చిరునవ్వులు చిందించాడు. అన్నమాచార్యుడు తన కృతులలో పొగరు వెన్నెలలు కురిపించాడు.

అన్నమాచార్యుని జీవిత మొక దీర్ఘ శరణాగతి. ఆధారము, మధురభక్తి. ధ్యేయము మాధవారాధనతో మానవ కల్యాణము.అన్నమాచార్యుడుమహాకవి-అయినా కనకాభిషేకా లను ఆశించలేదు. అన్నమాచార్యుడు మహా గాయకుడు-కానీ మహాసభలు, సత్కారాలను కోరలేదు. అన్నమాచార్యుడు

మహోధకుడు - ఆత్మ సాయుజ్యం కోసమే పరిమితం కాలేదు. అతని చదువు, సంధ్యలు వేరు; అతని కుపదేశము చేసిన గురువులు లోక కల్యాణమును ప్రబోధించినవారే. అందుకే అన్నమాచార్యుడు ఒక మహాప్రవక్త అయినాడు. "విజాతు లన్నియు వృథా వృథా. జాతిభేదములు శరీర గుణములు. జాతి శరీరముతో చెడును. ఆత్మ పరిశుద్ధ మయినది. హరి విజ్ఞానపు దాస్యమే సుజాతి. ఏ కులజుడేమి? ఎవ్వడైననేమి? హరి నెరిగినవాడే ఉన్నత కులజుడు. బ్రహ్మతత్త్వం అణువు మొదలు అజాండం వరకు వ్యాపించింది. దీనికి జాతితో, కులముతో, వర్గముతో నిమిత్తము లేదు. హీనాధికము లిందు లేవు. అందరికీ శ్రీహరే అంతరాత్మ. రాజు నిద్రించు నిద్ర, బంటు నిద్ర ఒకటే. బ్రాహ్మణుడు, చండాలుడు మెట్టు భూమి ఒక్కటే. అహోరాత్రులు ధనాఢ్యునికి, నిరుపేదకు ఒక్కటే. దుర్గంధముల పైన, పరిమళము పైన వీచే గాలి ఒక్కటే. ఏనుగ మీద కుక్కమీద కాసే ఎండ ఒక్కటే." ఇవి అన్నమాచార్యుని ఆత్మబోధలు, ప్రబోధాలు, ఏడు కొండల మీద నుండి ఎలుగెత్తి తనవారికి వినిపించిన మానవ సౌభ్రాతృత్వపు గీతాలు. అర్థాలకు, అనర్థాలకు మనసు మూలం. అభ్యాసంతో వైరాగ్యంతో ఈ మనోచాంచల్యాన్ని అరికట్టవచ్చు. అన్నమాచార్యుని మానస బోధ సులువైనది. 'నటనల భ్రమయకు ఓ మనసా! ఈ జగమొక మోహినీ

గజం. ఆశను కలిగించేది. వంచనలు నిజంలా కనిపిస్తాయి. మరునాడు మంచులా కరిగిపోతాయి. ఇదే మాయ. దీనికి తెర వేయాలంటే శాశ్వతమైన వేంకటేశ తత్త్వాన్ని అనుభవించడమే.' అన్నమాచార్యుడు ఈ మనసు మీద చేసిన పరిశోధనల సారాంశమే ఆత్మబోధ సిద్ధాంతం. అతడు మరికొంత విపులంగ చెప్తున్నాడు, "సముద్రంలో అలలు నిలిచిన తర్వాత స్నానం చేద్దాంలే అనుకోవడ మెటువంటిదంటే, మనసులో కోరికలన్నీ అంతరించిన తర్వాత పరమాత్మని గురించి ఆలోచిద్దాంలే అనుకోవడం వంటిది. ఆ కడలి అలలు నిలువవు. మనసులో కోరికలూ అంతరించవు. ఇంద్రియ దాహం తీరిన తర్వాత తత్త్వం తెలుసుకొందాం అనుకుంటే అది సాధ్యమయ్యే వని కాదు. ఆ దాహం అణగేది కాదు. తత్త్వం తెలుసుకొనేది కాదు. దేహం ఉన్నంత వరకు పదార్థ మోహం కూడ తీరదు." అంతరంగ బహిరంగాలలో శుద్ధి ఏర్పడినప్పుడే మాయ తొలగి యథార్థం భాసిస్తుంది. అది పట్టపగటి వెలుగు. దీనిని సాధించడం తేలిక. "భావములోన బాహ్యమునందును 'గోవింద గోవింద' యని కొలువవో మనసా!" అని సప్తగిరులు ఘూర్ణిల్లేటట్లు అన్నమాచార్యుడు సంకీర్తనాక్రందనం చేశాడు. శరణాగతి మంత్రం అన్నమాచార్యుని అధ్యాత్మ సంకీర్తనలకు జీవనాడి. 'శరణు వేంకటనాయకా' అనడం తేలికే. 'ఎండగాని నీడగాని

ఏమైనాగాని కొండలరాయడే నా కులదైవం' అని నమ్మి ఆచరించడమే కష్టం. "నీవే తప్ప నితఃపరంబెరుగ కావవే వరదా" అని గజేంద్రునిలా "శ్రీకృష్ణా యదుభూషణా! నీవే నాకు దిక్కు" అని కుంతిలా జీవుడు శరణాగతుడై నప్పుడు దేవుడు తప్పక కాపాడుతాడు. ఇదే గీతాచార్యులు వినిపించిన చరమ శ్లోకం. "అంతర్యామీ అలసితి. ఇంతట నీ శరణిదె జొచ్చితిని" అని "విడువ విడువ నిక విష్ణుడ నీ పాదముల" అని అచంచల విశ్వాసముతో శరణాగతుడైన అన్నమాచార్యుడు తన అనుభవసారాన్ని తన సాటి మనుష్యుల కుపదేశం చేస్తున్నాడు. "ఆచార్య విశ్వాసము కలిగి, శరణాగతి సాధనముతో శ్రీ వేంకటేశ్వరుని కొలచి దాసుడౌటే బ్రహ్మానంద వేదాంత రహస్యము" ఆ శ్రీవేంకటపతి పాద సరోరుహ పాలకుడు అరటి పండొలిచి చేతుల కందించినట్లు జీవిత తత్త్వాన్ని వివరిస్తాడు. ఇంత సరళంగ తేటమాటలతో జీవిత సత్యాన్ని వివరించిన కవి, ప్రవక్త, తత్త్వవేత్త ఆంధ్ర వాఙ్మయంలో మరొకరు కనిపించరు. "నానాటి బదుకు నాటకము, కానక కన్నది కైవల్యము."

అన్నమాచార్యుని వ్యక్తిత్వం అకుంఠితమైనది. అతని ఆత్మీయత నిర్మలమైనది. అది వినయసుందరము. అహంకార విరహితము. "నరహరి కీర్తన నానిన జిహ్వా ఒరుల నుతింపగ

నోవదు. మురహరు పదముల మొక్కిన శిరము పరుల వందనకు పరగదు, పుట్టుభోగులము. భువి హరిదాసులము, నట్టనడిమి దొరలు నా కియ్యవలెనా. శ్రీవేంకటేశుడు మమ్ము నేల యిన్నియు నిచ్చె. "అడవిలో మృగజాతియైన కావచ్చుగాక, వడి నితరుల కొలువంగవచ్చునా. ఉడివోని పక్షియై వుండనైనవచ్చుగాక, విడువ కెవ్వరినైనా వేడవచ్చునా. పసురమై, ఉసురుమానై పుట్టవచ్చుగాక ఇతరుల పొగడగా వచ్చునా", భగవద్భక్తి సామ్రాజ్యమేలే భాగవతుల ఆత్మప్రత్యయ మిది. "అతి మూఢులలో అగ్రేసరుడను. ప్రతిలేని ఘనగర్వపర్వతమను, పంచేంద్రియముల ధనవంతుడను. మహిలో సంసారపు సామ్రాజ్యమేలేవాడను. భావించి నా వంటి నీచు పట్టి కాచినప్పుడుగా, యే వంక నీ కీర్తి కడు నెంతురు భువి. నావల్ల నీకు పుణ్యము, నీవల్ల నే బ్రదుకుదు. నే నొక్కడ లేకుండితే నీ కృపకు పాత్రమేది ! పూని నా వల్లనే కీర్తి పొందేవు నీవు." ఈ వినీతచిత్తవృత్తి అన్నమాచార్యుని పరమపద సోపానముల నధిరోహింప చేసినది. కైవల్యకాంతకు చేరువ చేసినది. శ్రీవేంకటపతి చరణాలలో బిరుదు గజ్జియిలను కావించినది.

లోకనీతి, ధర్మం, న్యాయం అన్నమాచార్యుడు తన సంకీర్తనల్లో వినిపించాడు. వెంకటేశ్వరతత్వం సకల

దేవతాస్వరూపమని చాటి చెప్పాడు. అతనికి రాముడు, కృష్ణుడు, నరసింహుడు, హనుమంతుడు అందరూ వేంకటపతి మూర్తిలోనే దర్శనమిచ్చారు 'ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు. అంతరాంతరము లెంచి చూడ పిండంతె నిప్పటి యన్నట్లు' అని వేంకటేశ్వర పరతత్త్వాన్ని ఇలా వివరించాడు. "కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని. తలతురు మిము శైవులు తగిన భక్తులును శివుడనుచు. అలరి పొగడుదురు కాపాలికుడు ఆదిభైరవుడనుచు. సరినెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీ వనుచు" అంటూ అన్నమాచార్యుడు చక్కని సమన్వయం చేశాడు, 'అల్పబుద్ధి తలచినవారికి అల్పంబవుదువు, ఘనబుద్ధులకు ఘనుడవు. నీవు నీరుకొలది తామరవు' 'శ్రీవేంకటపతీ! నీవు నన్ను స్వీకరించిన దైవానివి. నీ శరణనియెదను. ఇదియే పరతత్త్వము నాకు' అని దృఢంగ స్పష్టీకరించాడు. ఒక విధంగ తిరుమలలో వెలసిన వేంకటేశ్వరమూర్తిని స్త్రీమూర్తియా? పురుషమూర్తియా? శైవమా? శాక్తేయమా అని వృథానుమానాలతో కాలయాపన చేసేవారికి ఇది చక్కని సమాధానం కూడా చెబుతుంది.

సామాన్య జీవితాన్ని ప్రతిబింబించే మధుర కవితలను అన్నమాచార్యుడు రచించాడు. ఆబాలగోపాలం అందరూ

మాటల్లోనే తమ పాటలు పాడుకోవలె, శ్రీనివాసుని మాహాత్మ్యాన్ని, తత్వాన్ని అనుభవించవలెననే అతని ఆశయము. అందుకే జానపద బాణీలలో, వాడుకభాషలో సంకీర్తనలను గానం చేశాడు. చందమామ పాటలు, ఉగ్గు పాటలు, కూగూగ, దోబూచి పాటలు, లాలి జోల ఉయ్యాల మొదలైన బాలల పాటలు రచించాడు. ఆరతులు, నీరాజనాలు కళ్యాణ వేడుకలు, శోభనాలు, గొబ్బిళ్ళు, దంపుళ్ళు, సువ్వి సువ్వాలలు, పవ్వళింపు, మజ్జనాలు, ఏలలు మొదలైన స్త్రీల పాటలు వినిపించాడు. తత్వాలు, మానస బోధలు, తందాన పదాలు, మేలుకొలుపులు, తుమ్మెదలు, జాజరలు, అత్తా కోడళ్ళు, బావా మరదళ్ళు, గోపికాకృష్ణులు, యశోద గోపికలు, చెంచెత నరహరులు, బలరామకృష్ణులు, గామాంజ నేయులు మొదలైన సంవాదాత్మక గేయాలు ఈ మహాకవి రచనల్లో చోటు చేసుకొన్నాయి. ఈ పదాలలో వస్తువొక్కటే. అది శ్రీనివాసుని పరతత్వ నిరూపణ. జానపద ధోరణిలో వేంకటపతి 'చీరలమ్మే నేత బేహారి'గా, 'బోయనాయుడు'గా 'బొమ్మిరెడ్డి'గా కూడ చెలామణి ఔతాడు.

అన్నమాచార్యుల శృంగార పదాలు ఆధ్యాత్మికస్థాయి కెక్కినవి. 'పుమాన్ విష్ణు రితిఖ్యాతః స్త్రీప్రాయమితరం జగత్', 'విష్ణు వొక్కడే పురుషుడు, తక్కిన సృష్టి అంతా

స్త్రీమయమే' అనే సిద్ధాంతాన్ని నమ్మి ఆచరించినవాడు. శ్రీనివాసుని పురుషోత్తమత్వాన్ని, వింత వింత జీవనాయికల అనుభవాలను, భగవత్సంయోగానికి వారనుసరించిన మధుర భక్తిమార్గాలను, శృంగార పదాలలో విలక్షణంగ వర్ణించాడు. అన్నమాచార్యుడు భాగవత భక్తినే తన పదాలలో ప్రపంచించాడు. అతనికి శృంగార మొక సాధన. నిరంతర తైల ధారవంటి ప్రేమభక్తి దీనివలన సిద్ధిస్తుంది. ఇది గోపికలు నడచిన మార్గం, రాధ చూపిన పద్ధతి, ఆళ్వారులనుసరించిన విధానం. తాను దాసానుదాసినై అతని 'జంటవీడకంటి' ఉంటాడట. 'అతివ జన్మము సఫలమై పరమయోగివలె నితర మోహాపేక్షలన్నియును విడిచెనట.' ఇది నాయిక వియోగ వ్రతం. 'అదనెరిగి తిరువేంకటాధీశ పొందితివి, చదురుడను నిను బాయజాల నొకమారు' ఇది నాయిక సంయోగసిద్ధి. ఆ నాయిక కామ యాగము చేసినదట. 'శ్రీతిరువేంకటేశ్వరుని పొందు ఘనమైన దివ్యభోగము కావున'.

అన్నమాచార్యుడు ఆత్మ కల్యాణమే కాంక్షించినట్లైతే తిరుమల ప్రభువును, తిరువీధులను వదలి వచ్చేవాడు కాదు. అతని జీవిత ధ్యేయం గొప్ప సాంఘిక ప్రయోజనం. తాను తరించడమే కాదు, తన తోటి మానవ సమాజం కూడ తరించవలెననే అతని తపన. అందుకే క్రూరసర్పాలవంటి రాజులతో

చెలిమి చేశాడు. ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడినా, వ్యక్తి గత విద్వేషాలను ఎదుర్కొనక తప్పదు. "శ్రేయాంసి బహు విఘ్నాని." అన్నమాచార్యుడు ఎదుర్కొన్న సమస్యలు, బాధలు ఒకటా రెండా. పదం వ్రాసినా పాడినా, బూతనే పండితులు. పాటనే బాటగా చేసుకొన్న అన్నమాచార్యుని విషయంలో ఇక చెప్పనక్కరలేదు. పదకర్తలు నీతి బాహ్యులని, గాయకులు పంక్తి బాహ్యులని తీర్మానించే పండిత పరిషత్తులను అన్నమాచార్యుడు శ్రీనివాసాస్త్రంతో ఎదుర్కొన్నాడు. పదం వ్రాశాడు, పదం పాడాడు. వీనికి తోడు జన పదాలలో పదాలను వాడాడు. జన వ్యవహారంలోని నానుళ్ళను పలుకుబళ్ళను, జాతీయాలను విరివిగ వాడాడు. లక్షణ కర్తలు గ్రామ్యమని నిరసించిన పదజాలాన్ని పట్టుపట్టి ప్రయోగించాడు. పదాలు, శబ్దాలు పూలవంటివి. వీనిని మృదువుగ తాకి వాసన చూడవలెనే కాని పట్టి పిసికి కాదు. భాషా ప్రక్రియల విషయకంగ విప్లవ శంఖాన్ని పూరించిన అన్నమాచార్యుడు, భావం విషయంలో కూడ క్రొత్తదారులు త్రొక్కాడు. తర్వాతి ప్రబంధ కవులు ఈ విషయంలో అన్నమాచార్యుని కొల్లగొట్టారు. అన్నమాచార్యుని 'శృంగారమంజరి' ప్రణాళిక మీదనే భట్టుమూర్తి వసుచరిత్ర మహాకావ్యాన్ని నిర్మించాడు. ఇతని శృంగార పదాలలో వెల్లివిరిసిన మధురభక్తిని అపార్థం చేసుకొన్నవారు లేకపోలేదు. అలమేలుమంగా శ్రీనివాసుల

అమలిన దివ్యశృంగారాన్ని అసత్యమని, అనుచితమని కొందరు నిరసించారు. ఈ పరీక్షలకు, పరిశోధనలకు అన్నమాచార్యుడు తట్టుకొన్నాడు. ఆత్మవిశ్వాసం, కార్యదీక్ష, ఆచరణ శుద్ధి, నిష్కామకర్మ - అన్నమాచార్యుని మహోద్యమానికి ఊపిరులూదినవి. కరువు కాటకాలు, రాజకీయ విప్లవాలు, దండయాత్రలు, మతకల్లోలాలు, కుటుంబ సమస్యలు అన్నమాచార్యునికి తాత్కాలికమైన విఘాతాలు కలిగించినా, ఆ శ్రీనివాసదాసునికి వ్రతభంగంమాత్రం కలుగలేదు. మాధవుని సేవిస్తూ మానవుని, మానవుని సేవిస్తూ మాధవుని, ఆరాధించి తన ధ్యేయాన్ని సాధించి అజరామరమైన కీర్తిని పొందిన మహాసంస్కర్త అన్నమాచార్యుడు.

అన్నమాచార్యుడు తన శేషజీవితాన్ని శేషగిరీశుని చెంతనే గడపసాగాడు. వేంకటాచలానికి సమీపంలో 'మరులుంకు' అనే అగ్రహారంలో వాసం చేసేవాడు. "శ్రీనివాసుని దాసానుదాసినై వొంటి నుండెద నేమీ నొల్లనోయయ్యా" అని పెరుమాళ్ళతో ప్రొద్దు గడిపేవాడు. రాజకీయ సాంఘిక విప్లవాలతో విసిగిపోయాడు. సంగమ వంశానికి చెందిన విరూపాక్షరాయలను అతని పెద్ద కుమారుడు రాజశేఖరరాయలు చంపించాడు. రాజశేఖరరాయలును అతని తమ్ముడు చంపించాడు. దుర్మార్గుడైన రెండవ విరూపాక్ష

రాయలును, దండనాథుడైన సాళ్వనరసింగరాయలు వెడల గొట్టి విజయనగర సింహాసనాన్ని ఆక్రమించాడు. ఇక మతకల్లోలాలు మితిమీరినవి. భూసురుల తలలు తెగి నేల పడినవి. పసిబిడ్డల ఆక్రందనలు చెలరేగినవి. గోవుల తలలు నరికారు. దూడలు అంగలార్చినవి పట్టపగలు కామినుల మానభంగాలు. భర్త చూస్తూ ఉండగా భార్యలను చెరిచారు. గూను వంచి ముసలి తల్లి చూస్తూ ఉండగా కొడుకు తల నరికారు. గుళ్ళు కూలిపోయినవి. దేవుళ్ళు దిక్కులేకపోయారు. దేవాలయాలు మారణహోమానికి కేంద్రాలైనవి. కలికాలం మితిమీరింది. బ్రాహ్మణ యువతులు బోయలను పెండ్లాడి నిప్పులలో దుమికి ప్రాణత్యాగం చేసుకొన్నారు. అన్నా చెల్లెండ్రు వావి వరుసలు మాని దంపతులయ్యారు. యతులు ధనవంతులయ్యారు. పతివ్రతలు అధికారుల ఉంపుడుగత్తె లయ్యారు. రాజుల భార్యలు వాడ వేశ్యలయ్యారు. ఈ మత రాజకీయ సాంఘిక కల్లోలాలలో అన్నమాచార్యుని పూజా విగ్రహాలను ఎవరో అపహరించుకొని వెళ్ళారు. తాను నిత్యం ఆరాధించే వేంకటపతి మూర్తిని కానక తల్లడిల్లిపోయాడు. వేదనతో గానం చేశాడు. "ఇందిరారమణు తెచ్చి యియ్యరో! నాకిటువలె, పొంది యీతని పూజించ పొద్దాయనిపుడు" మహా భక్తులందరినీ వరుసగా "అంజనీతనయా, గరుత్మంతుడా,

ప్రహ్లాదుడా, అర్జునా, శేషమూర్తీ, కార్తవీర్యార్జునుడా ఈ దేవుని నీ వేళ నిట్టె తెచ్చి మాకునియ్యరో" అని ప్రార్థించాడు. అన్నమాచార్యుని పూజా విగ్రహాలు వారి అనుగ్రహం వల్ల దొరికినవి. అన్నమాచార్యులు వానిని దర్శించి, పులకించి, పూజించి, అర్చించి, కీర్తించి ఆనంద సముద్రంలో ఓలలాడాడు.

అన్నమాచార్యుని సంకీర్తన సేవ సంగీత సాహిత్య పరిపుష్టంగా నడచినది. తెలుగు పదాలను విరివిగా వాడినా ఉచితమైన చోట సంస్కృత భూయిష్ఠమైన రచన చేశాడు. సంస్కృత భాషలోనే ప్రత్యేకంగా కొన్ని వందల సంకీర్తనలను రచించాడు. తెలుగు శబ్దాలలో తమిళ కన్నడ భాషల పదజాలం కూడ చోటు చేసుకొన్నది. దక్షిణాపథమంతా యాత్రలు చేసి జనంతో సన్నిహిత సంబంధం కలిగిన అన్నమాచార్యునిలో అక్కడక్కడ అన్య భాషా పదజాలం గోచరిస్తుంది. అన్నమాచార్యుని తెలుగు వ్యావహారిక సిద్ధము, నిఘంటు ప్రసిద్ధము కాదు. కావ్య భాషా పదజాలాన్ని కూర్చి నిఘంటు కర్తలు, ప్రజా వాఙ్మయానికి తీరని అన్యాయం చేశారు. అవ్పటపు తెలుగు పదాల సౌరు కృతికి ప్రాణవాయువు. అన్నమాచార్యుని కృతులలో వినిపించే విసర్గమైన తెలుగు అదృష్టం గొప్పది.

అన్నమాచార్యుని కాలానికి పూర్వం సంగీతం లేక పోలేదు, పాటలూ ఉన్నాయి. కాని వాని స్వరూపాన్ని నిర్దిష్టంగ తెలుసుకొనే అవకాశం తక్కువ. శివకవుల వ్రాతల్లో తెలుగు నాట ప్రచారంలో ఉన్న పదాలను పేర్కొనడం జరిగింది. కాని ఆ పాటలేమిటో, వాని స్వరూపాలేమిటో తెలియదు. ఉపలబ్ధమైన పాటల్లో తాళ్ళపాక అన్నమా చార్యులవే తొలి సంకీర్తనలు. అంతకు ముందు కృష్ణమా చార్యుల వచనాలున్నా అవి "అంగాంగి విభాగం లేక అఖండ గద్య ధారగా, గేయగంధులుగా మిగిలినవి." ఆ గానగంధం కూడ మన దాకా రాలేదు. అన్నమాచార్యుడు నూతనంగ నాద శరీర కల్పనకు పాటు పడలేదు. సిద్ధమైన వర్ణమెట్లను గ్రహించి రచన సాగించినవాడే. మార్గదేశి సంగీత పద్ధతులు రెండు ఆతని రచనల్లో ఉన్నాయి. సంకీర్తనలతో బాటు సంకీర్తనా పరిశుద్ధికి సంస్కృతంలో 'సంకీర్తన లక్షణ'మనే గ్రంథం రచించాడు. అందులో తన పదస్వరూపం గురించి విపులంగ వ్యాఖ్యానించాడు. అన్నమాచార్యుల సంకీర్తనల రాగిరేకుల్లో రాగాలను పేర్కొన్నారే కాని తాళాల ప్రసక్తి లేదు. (అక్కడక్కడ పది పండ్రెండు పాటలకు మాత్రం రాగంతో బాటు తాళాలను కూడ పేర్కొన్నారు.) వస్తువును బట్టి వీనిని శృంగారం, ఆధ్యాత్మం అని విభజించినా స్వరూపంలో తేడాలేదు. పల్లవి, మూడుచరణాలు ప్రాయికంగ

అంతటా గోచరిస్తాయి. అనుపల్లవిగ చేసుకోవడానికి పల్లవి లోనే అవకాశం ఉన్నా ఎందుకో లాక్షణికంగా దానిని పేర్కొని విభజించలేదు. 'దేశి సూళాది' అనే రాగ తాళ మాలిక ఒకటి అన్నమాచార్యుని పాటల్లో విలక్షణంగ గోచరించింది. కన్నడ హరిదాసుల వాఙ్మయంలో బహుళ ప్రచారంలో ఉన్న సూళాదులు తాళ మాలికలేగాని రాగ మాలికలు కావు. అన్నమాచార్యుడు కృతి, సంకీర్తన, కీర్తన, పదం, పాట - అనే శబ్దాలు సమానార్థకం గానే వాడాడు. తోడై మంగళం పేరుతో ప్రసిద్ధంగ గానం చేసే ఐదు సంకీర్తనలు తాళ్ళపాక వారివే. దక్షిణా పథంలో భజన సంప్రదాయానికి అన్నమాచార్యుడే ఆద్యుడు. కర్ణాటక సంగీతం పేరు పెంపులకు అన్నమాచార్యుని సంకీర్తన చాల వరకు తోడ్పడింది. పదానికి ఒక అచ్చు కట్టైన స్వరూపాన్ని సంతరించిందితడే. వంద రాగాలకు పైగా వీరు పేర్కొన్నా ఇప్పుడు ప్రచారంలో ఉన్నవి మూడు వంతులకు తక్కువే. వాని స్వరూపం కూడ తెలుసుకోవడానికి వీలులేదు. గాయక సంప్రదాయం లేనందువల్ల అన్నమాచార్యుని సంకీర్తనల గాన స్వరూపం తెరమరుగైంది. తాళ్ళపాక కవులు 'సంకీర్తన అరళప్పాడు' ఏర్పాటు చేసినట్లు శాసనస్థమైన ఆధారాలున్నా, గాయకులు ఈ సంకీర్తనలు గానం చేసినట్లు కూడ లిఖిత

ఆధారాలున్నా, కారణాంతరాలవల్ల ఆ సంగీతం కాలగర్భంలో కలసిపోయింది. ఇప్పుడు మనకు మిగిలినవి ఒట్టి శబ్ద పంజరాలే. అన్నమాచార్యుడు గానం చేస్తుంటే శిష్యులు వానిని తాళపత్రాల కెక్కించారు. వీనికి శాశ్వతత్వం కలిగించడం కోసం అతని పుత్రపౌత్రాదులు రాగిరేకుల మీది కెక్కించారు. సంగీతానికి సంబంధించిన స్వర లిపి అప్పుడు వృద్ధి పొందలేదు కాబట్టి, రేకులమీద సారస్వత స్వరూపమే నిలచింది.

యోగ వైరాగ్య శృంగార సరణి 32000 సంకీర్తనలు అన్నమాచార్యుడు రచించినాడని మనుమడు చిన్నప్ప పేర్కొన్నాడు. పరమ మంత్రాలవంటి ఆ పాటలని భిన్న విభిన్న పరిమాణముగల రాగి రేకుల మీదికి యెక్కించారు. వీనిని సురక్షితంగ ఉంచడానికి తిరుమలలో సంకీర్తన భండారమనే రాతి కట్టడంలో నిక్షిప్తం చేశారు. దక్షిణా పథంలో వైష్ణవాలయాలకు ప్రచార నిమిత్తం తీసుకొని వెళ్ళినట్లు ఆధారాలున్నాయి. శ్రీరంగం, అహోబిలం నుండి కూడ కొన్ని రేకులను సేకరించడం జరిగింది. అన్నమాచార్యుని సంకీర్తనలతో బాటు తాళ్ళపాక పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య సంకీర్తనలు, కొన్ని లఘు రచనలు కూడ లభించాయి. అన్నమాచార్యుని రచనలు లెక్కకు 12000లకు లోపుగానే ఉన్నాయి. మిగిలిన 20000 సంకీర్తన లేమైనవి.

రాగి రేకులను పరిశీలిస్తే కొన్ని వేల రాగిరేకులు గణనకు రావడం లేదు. దీనినిబట్టి ఆ రేకులన్నీ కాలగర్భంలో కలసి పోయినట్లున్నవి. రాగం విలువ తెలియని జాతి రాగికోసం వానిని కరిగించుకొన్నది.

అన్నమాచార్యుని మహాభక్తునిగా తీర్చిన శక్తులెన్నో ఉన్నాయి. తన పురాకృతపుణ్యం, తల్లిదండ్రుల శిక్షణ, గురువుల బోధనలు, రాజాధికారులతోటి చెలిమి, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం, వీటన్నిటిని మించి శ్రీవేంకటేశ్వరుడు పరతత్త్వమని ప్రబోధించిన ఉత్తమ సంస్కారం. ఆధి భౌతికము, ఆధ్యాత్మికము అయిన సర్వ ప్రపంచంలో శ్రీనివాసునే భావించాడు. అంతరంగ బహిరంగాలలో ఆ మూర్తినే నిలిపి ఆడి పాడి, కలసి కలహించి, పొగడి తెగడి అన్నిటా అతని బ్రతుకే బ్రతికినవాడు. ఆ అనుభవాలు మానసికం, కాయికంగానే కాక వాచికంగ కూడ అనుభ వించాడు. ఆ వాచికానుభవాలే అన్నమాచార్యుని సంకీర్తన పీఠికలు. మరులుంకు గ్రామంలో ఒకనాడు అన్నమాచార్యుడు స్వామికి నైవేద్యంగ జీడిమామిడి పళ్ళుపెట్టి ఆ ప్రసాదాన్ని స్వీకరించాడు. పళ్ళు పులిసిపోయాయి. 'అయ్యయో! ఎంత అపచారం! అమృతమూర్తికి పులుసు పండ్లు నైవేద్యమిడితినే' అని ఆ భక్తుడు బాధపడిపోయాడు. ఆ జీడిమామిడి చెట్టు

వద్దకు వెళ్ళి వేంకటపతి కృతిగానం చేస్తూ దానిని స్పృశించి 'పులుపును పరిహరించి దీనికి మాధుర్యాన్ని ప్రసాదించవే' అని దేవుని అర్థించాడు. ఆ మామిడి వళ్ళు అమృతోపము లైనవట. ఈ మాహాత్మ్యం ఆ నోట ఈ నోట ప్రాకినది. ఒక పేద బ్రహ్మణుడు అన్నమాచార్యుని ఆశ్రయించి 'నేను పెళ్ళి చేసుకోవలె' 'కాసువీసం దయ చేయుడని' ప్రార్థించాడు. అన్నమాచార్యుడు 'ఔలెమ్మన్నాడు.' ఆ బ్రాహ్మణునికి కాసు వీసానికి మించి దొరకలేదు. తన తప్పు తెలుసుకొని ఆ విప్రుడు 'కల్యాణానికి వలసిన ధన మిప్పించమన్నాడు'. అన్నమాచార్యుడు నవ్వుతూ ఆశీర్వదించాడు. ఆ బ్రాహ్మణుని పిలిచి రాజొకడు ఘనంగా కల్యాణాన్ని జరిపించి ధనకనక వస్తు వాహనాలతో అతని తృప్తిపరచినాడట. ఈ కథలు ప్రచారం పొంది అన్నమాచార్యుని సంకీర్తన సేవకు అవరోధంగా జనులు తండోపతండాలుగా రాసాగినారు. అన్నమాచార్యుడు వీనికి విరక్తుడై తిరుమల దేవుని సన్నిధానంలో ప్రొద్దుపుచ్చ సాగాడు.

వేంకటేశ్వరుని సన్నిధానంలో సంకీర్తన తపస్సులో తత్పరుడైనఅన్నమాచార్యుని పురందరదాసు కలుసుకొన్నాడు. అన్నమాచార్యుని కీర్తనలకు పరవశిస్తూ, 'మీ సంకీర్తనలు పరమ మంత్రాలు. వీనిని వించేచాలు పాపం పటాపంచలౌ

తుంది.భూతభేతాళపిశాచాలు వైదొలగిపోతాయి.మీరు సాక్షాత్తు వేంకటపతి అవతారమే' అని దాసుల వారు స్తుతించారు. అన్నమాచార్యుడు పురందరదాసుని సంభావిస్తూ "నాయనా నీవు సామాన్యుడవా. సంధ్య వార్చుకోవడానికి సాక్షాత్తు విఠలునితోనే నీళ్ళు తెప్పించుకొన్న భాగ్యశాలివి. నీ పాటలు కర్ణాటక సంగీతానికే తొలి పాఠాలు. నిన్ను చూస్తే పాండు రంగని దర్శించినట్లే" అన్నాడు. ఆ పదకవితా, కర్ణాటక సంగీత పితామహుల కలయిక తిరుమల చరిత్రలో చిరస్మర ణీయమైన సన్నివేశం. పురందరుల మాటలు సత్యం. అన్నమాచార్యుడు తన సంకీర్తనలను 'వేంకట'ముద్రాంకితం చేశాడు. అవి అన్నమయ్య పాటలు కావు, 'వేంకటేశ మంత్రాలు'. "అన్ని మంత్రము లిందే ఆవహించెను, వెన్నతో గలిగె నాకు వేంకటేశు మంత్రము" అని అన్నమా చార్యుడే పేర్కొన్నాడు.

సుమారు రెండు శతాబ్దాలు తాళ్ళపాక కవులు భిన్న విభిన్న సారస్వత ప్రక్రియలతో ఆంధ్రభాషను సుసంపన్నం చేశారు. తాళ్ళపాక అన్నమాచార్యుడు ఆధ్యాత్మ శృంగార సంకీర్తనలతోబాటు మంజరీద్విపదతో 'శృంగారమంజరి' అనే కావ్యాన్ని రచించాడు. వీరు రచినారని పేర్కొన్న పంద్రెండు శతకాలలో వేంకటేశ్వర శతక మొక్కటే

లభించింది. అనేక భాషల్లో రచించిన ప్రబంధాలు గాని, సంస్కృత రచనలు - వేంకటాచల మాహాత్మ్యం, సంకీర్తన లక్షణం, ద్విపద రామాయణం ఇంతవరకు లభించలేదు. అన్నమాచార్యుని భార్య లిరువురు తిమ్మక్క, అక్కలమ్మ. తిమ్మక్క సుభద్రాకళ్యాణం మంజరి ద్విపదకావ్యం ముద్రణ కెక్కినది. ఈమె తెలుగులో తొలి కవయిత్రి. ఈమె కుమారుడు నరసింహుడు. "పాదఁజెప్పఁగ వర్ణ పద్ధతి నీడు జోడు లేఁడని సభ సొచ్చి వాదించి, పరఁగిన ధీశాలి ప్రతి వాదదైత్య నరసింహుఁడనఁగల్గె నరసింహ గురుఁడు" అనే చిన్నన్న మాటలవల్ల నరసింగన్న సంగీత సాహిత్య కళా కోవిదుడని తెలుస్తున్నది. కవికర్ణరసాయన కావ్యం రచించిన సంకుసాల నరసింహకవి ఇతడేనని వాదించు వారు లేక పోలేదు. నరసింగన్నకు నాచ్చారమ్మ, అనంతమ్మ ఇద్దరు సతులు. నాచ్చారమ్మ ద్వారా నారాయణుడు, అనంతమ్మవల్ల అప్పలార్య, అన్నలార్యలు జన్మించినట్లు తెలుస్తున్నది. తిరుమలాచార్యుడు తండ్రి అడుగుజాడలలో సంకీర్తన యజ్ఞం నిర్వహించినవాడు. ఇతని ఆధ్యాత్మ శృంగార సంకీర్తనలతో బాటు మరికొన్ని లఘు రచనలు లభించినవి. వేంకటేశ్వర వచనములు, శృంగారదండకము, చక్రవాళమంజరి, శృంగార వృత్త శతకము, వేంకటేశ్వరోదాహరణము, నీతిసీసశతకము

సుదర్శనరగడ, రేఫ అకార నిర్ణయం, భగవద్గీత తెలుగు అనువాదం (వచనం) దీనికి ఆంధ్ర వేదాంతమనే పేరుంది, శ్రీవేంకటేశ్వర ప్రభాతస్తవము (ద్విపద). ఇతని సంకీర్తన లక్షణ వ్యాఖ్యానం దొరకలేదు. ఇతని సతీమణి తిరుమలమ్మ పంచపాండవుల వంటి కొడుకుల నైదుగురిని కన్నది. చిన తిరుమలయ్య, అన్నయ్య, పెద తిరువెంగళనాథుడు, చిన్న తిరువెంగళనాథుడు (చిన్నన్న), కోనేటి తిరువేంగళనాథుడు. చిన తిరుమలయ్య తండ్రి తాతల మార్గంలోనే అధ్యాత్మ శృంగారసంకీర్తనలు రచించాడు. ఇవిగాక అష్టభాషాదండకం, సంకీర్తన లక్షణం (తండ్రి తాతల రచనలకు అనువాదం) ఉన్నాయి. ఇతని భార్య పెద మంగమ్మ. వీరి కుమారుడు తిరువేంగళప్ప, ఇతని అమరుక కావ్యానువాదము, అమర కోశానికి బాల ప్రబోధికవ్యాఖ్య, మమ్మటుని కావ్య ప్రకాశికకు సుధానిధి వ్యాఖ్య ఉన్నాయి. ఇతని రామచంద్రోపాఖ్యానం లభించలేదు. పెద తిరుమలయ్య మిగిలిన కుమారులలో చిన్నన్న సారస్వత మూర్తే గోచరమౌతున్నది. ఈ చిన్నన్న ద్విపద కవితకు విశేష ప్రచారాన్ని కలిగించాడు. ఇతడు మహాగాయకుడు. భజన సంప్రదాయాన్ని వాడవాడల దక్షిణా పథంలో ప్రచారం చేశాడు. అన్నమాచార్యుని జీవిత చరిత్రతో బాటు ఈ మహాకవి, గాయకుడు అందించిన మూడు ద్విపద మహాకావ్యాలు - పరమ యోగి విలాసము,

అష్టమహిషీ కల్యాణము, ఉషా పరిణయము. చిన్నన్న సంకీర్తనలని రెండింటిని ఎట్టియాపురం సుబ్బరామ దీక్షితులు తన సంగీత సంప్రదాయ ప్రదర్శినిలో ఉదాహరించాడు. చిన్నన్న మహాభక్తుడని తెలియజేసే వృత్తాంతా లున్నాయి. పద్మసాలీలకు, జాంబ్ర వారికి వివాద మేర్పడింది. లక్ష్మీదేవి పుట్టింటి వారము తామే అని పరస్పరం కలహించుకొన్నారు. చిన్నన్న 'నా పుట్టింటివారు పద్మసాలె' వారని అలమేలు మంగతో సాక్ష్యం చెప్పించినాడట. ఈ విషయాన్ని తెలిపే శాసనం కూడ ఉంది. అప్పటినుండి పద్మశాలీలు తాళ్ళపాక వారికి శిష్యులైనారు. చిన్నన్న వరాహస్వామి సన్నిధిలో సంకీర్తనగా పాడుతున్నారు. ఇరువురు దంపతులు వచ్చి 'స్వామీ మాకు సంతానం కలిగితే నీ రథ చక్రాలక్రింద ఆ పసికూనను ఉంచుతామని' వేంకటపతిని ప్రార్థిస్తే ఈబిడ్డ ననుగ్రహించాడు, చూస్తూ చూస్తూ స్వామి రథచక్రాలకు ఎలా బలి పెట్టేదని బావురుమన్నారు. చిన్నన్న వారికభయ మిచ్చాడు. రథం వేగంగ వస్తున్నది. పసిబిడ్డ దారికడ్డంగ ఉన్నాడు. అందరు ఆ వింతను చూస్తున్నారు. చిన్నన్న దండె మీటుతూ "నా మొరాలింపవే అయ్య వేంకటరమణ" అనే పాట నందుకొన్నాడు. వేగంగా వస్తున్న రథం ఆ పసి బిడ్డను తప్పించుకొని ముందుకు వెళ్ళింది... ఇది సంప్రదాయజ్ఞులు స్థానికంగ వినిపించినకథ. "తాళ్ళపాక చిన్నన్న

పదంబులు బాడిననాడే సర్వరాఘ్త్రెల విభుండు' అన్న వేంకటాచార్యుని వాక్యములు అసత్యములు కానేరవు. అన్నమా. చార్యుని కూతురు తిరుమలాంబ (అక్కలమ్మ పుత్రిక) తిరుమల కొండయార్యుని సతీమణి. వీరి కుమారుడే రేవణూరి వేంకటాచార్యుడు. ఇతని కృతులు శకుంతలా పరిణయము, శ్రీపాద రేణు మాహాత్మ్యము. తాళ్ళపాక కవులు సంస్కృతాంధ్రాలలో రచనలను చేసినవారు, ప్రాకృతములో ద్రవిడ భాషలలో పాండిత్యము కలిగినవారు. వీరు స్పృశించిన వివిధ సాహిత్య ప్రక్రియలు - సంకీర్తనలు, ద్విపదలు, మంజరీ ద్విపదలు, లక్షణ గ్రంథాలు, క్షేత్ర మాహాత్మ్యములు, దండకములు, శతకములు, వ్యాఖ్యానాలు, వచనాలు, రగడలు, ఉదాహరణలు, జీవిత చరిత్రలు. తాళ్ళపాక కవులు జానుతెలుగులో కృతులు రచించి ఆంధ్ర వాఙ్మయాన్ని ఐశ్వర్యవంతం చేశారు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారన్నట్లు "అదొక సారస్వత క్షీర సముద్రం. కావ్యముల ధర్మమైన భావార్ణవంలో, శైలిలో, భావ వైవిధ్యంలో, రాశిలో అన్నమాచార్యుని రచనను మించినది ఆంధ్ర వాఙ్మయంలో ఇంకొక్కటిలేదు." నగుబాట్లపాలైన ద్విపద, పదకవితలను ఉద్ధరించి ఉన్నత స్థాయిని కలిగించిన ప్రతిష్ఠ అన్నమాచార్యునిదే". 'చిన్నన్న ద్విపదకెరగును, పన్నుగ పెద తిరుమలయ్య పదమున కెరగున్, మిన్నంది మొరసె నరసింగన్న పద్యగద్య శ్రేణిన్' అనే తెనాలి రామకృష్ణుని చాటువు ఈ తాళ్ళపాక కవుల గురించి చెప్పినదే. అన్నమా

చార్యుని చదవనిదే తెలుగు రాదని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చెప్పిన మాటలు అక్షర సత్యాలు. తాళ్ళపాకవారి కృతుల పరిష్కరణ, ప్రకటన ప్రచారంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి కృషి ప్రశంసనీయమైనదే. ఇప్పుడు జరిగినది కొంతే. జరగవలసినదెంతో! "అంత మీదు పనులు నాతడే యెరుగు".

తాళ్ళపాక అన్నమాచార్యులు జన్మించినది శా. శ. 1330 సర్వధారి సంవత్సరం, నిజ వైశాఖ మాసం, శుక్ల చతుర్దశి బుధవారం, విశాఖా నక్షత్రంలో (9-5-1408). వేంకటేశ్వరుడు సాక్షాత్కరించినది శా. శ. 1346 క్రోధి సంవత్సరం (క్రీ.శ. 1424). అన్నమాచార్యుడు పరమ పదం చేరింది. దుందుభి సంవత్సరం ఫాల్గుణ బహుళ ద్వాదశి. (క్రీ. శ. 1503) అన్నమాచార్యుల సంకీర్తనల రాగిరేకుల ప్రారంభంలో మలచిన వాక్యాలనుబట్టి మనకు తెలియవచ్చే వివరాలివి. అన్నమాచార్యుడు అన్నమయ్య, అన్నమయ్యంగారు, అన్నయాచార్య, అన్నయగురు, అన్నయార్య అనే పేర్లతో వ్యవహరింపబడినట్లు తెలుస్తున్నది. పదకవితా పితామహుడు, సంకీర్తనా చార్యుడు, పంచమాగమసార్వభౌముడు, ద్రవిడాగమసార్వభౌముడు - ఇవి సమకాలీను లిచ్చిన బిరుద నామాలు. అన్నమాచార్యునికి వీని మీద రుచిలేదు, శుచిలేదు. "జనకుఁడు కారణజన్ముడై నట్టి, తనయున కాగమోక్త ప్రకారమున, జాతకర్మము చేసి సకల వేదాంత, జాతచోదితమునై

జలజోదరునకు, నామమై విన(బరిణామమై మున్ను హేమాంబ రుండానతిచ్చిన యట్టి, అన్నమయ్యాహ్వాయం బతనికి నౌసగె" అన్న చిన్నన్న మాటలే గురుతు. మరెవ్వరూ పేరు పెట్టకుండా, జన్మనిచ్చిన తల్లిదండ్రులు పెట్టిన పేరును సార్థకం చేసుకొన్న సత్పుత్రుడు అన్నమాచార్యుడు.


అన్నమాచార్యుని అవతారం సమాప్తం కానున్నది. అన్నమాచార్యుడు బాగా వృద్ధుడయ్యాడు. అతని హృదయంలో సంకీర్తన ఘోషలు వినిపిస్తున్నాయి-నారాయణ తే నమో నమో', 'అదివో అల్లదివో హరివాసము', 'తందనాన ఆహి తందనాన పురె తందనాన', 'కొండలలో నెలకొన్న కోనేటి రాయడు', 'బ్రహ్మ కడిగిన పాదము', 'అలరులు గురియగ ఆడెనదే', 'పలుకు తేనెల తల్లి పవళించెను', 'ఏమొకో చిగురు టధరమున', 'చేరి యశోదకు శిశు వితడు', 'సకలం హే సఖి జానామి', 'నానాటి బదుకు నాటకము', 'విన్నపాలు వినవలె', 'ఎక్కడి మనుష జన్మంబెత్తిన ఫలమేమున్నది', 'ఓహో దేండేం ఒగి బ్రహ్మమిది', 'జోఅచ్యుతానంద జోజో ముకుంద'. ఆచార్యుల హృదయం పొంగి కళ్ళలో ఆనందాశ్రువులు నిలిచాయి. పెద తిరుమలయ్యను సమీపానికి పిలిచి అంతిమ కోరిక తెలిపాడు, "తిమ్మప్పా! నేటితో నా సంకీర్తన యజ్ఞం పరిసమాప్తమౌతుంది. ఇంక దినానికి ఒక్క సంకీర్తన తక్కువ కాకుండా శ్రీనివాసునిక వినిపించే బాధ్యత నీదే." అన్నమాచార్యుడు ఆనందనిలయం

వైపు చూస్తూ సంకీర్తన అందుకొన్నాడు. దండె శ్రుతులు నినదిస్తున్నాయి. చిరుతలు తాళగతులను తెలుపుతున్నాయి. సంకీర్తనాచార్యుని కళ్ళు అమృతాన్ని వర్షిస్తున్నాయి. మంద్ర గంభీరంగ స్వరం వినిపిస్తున్నది. "దాచుకో! నీ పాదాలకు తగ నే చేసిన పూజలివి......నా నాలిక పైనుండి నా నా సంకీర్తనలు పూని నాచే నిను పొగడించితివి... కానిమ్మని నాకీ పుణ్యము గట్టితివి ... ఈ మాట గర్వము కాదు ... నీ మహిమే కొనియాడితినిగాని...శ్రీమాధవా! నీదాసుడ..." పాట ముగిసింది. పెద తిరుమలయ్య తల నిమురుతూ అస్పష్టంగ ఏదో పలికాడు. అది వేంకటేశ మంత్రం కాబోలు ... తిరుమలయ్య మనోనేత్రాలకు స్పష్టంగ గోచరించింది - అన్నమాచార్యులు శ్రీనివాసుని నందకంలో కలసిపోయాడు.

ప్రతి బహుళ ద్వాదశినాడు పెద తిరుమలయ్య ఇలా పాడుకుంటూ ఉండేవాడు. "దినము ద్వాదశి నేడు తీర్థ దివసము నీకు, జనకుఁడ! అన్నమాచార్యుఁడ విచ్చేయవే." చిన తిరుమలయ్య తాతగారికి తిరువారాధన నిర్వహిస్తూ ఉండేవాడు.

అన్నమాచార్యుని వాణి వినిపిస్తూనే ఉన్నది-

"ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము."





శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు

1941జూన్ 25న కడపలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు శ్రీమతి లక్ష్మీదేవి, శ్రీ వెంకట సుబ్బయ్యగార్లు.

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారి అంతేవాసులైన వీరు శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం నుంచి తెలుగులో ఎం.ఏ. పట్టా పొందారు. తెలుగు లెక్చరర్‌గా, అన్నమాచార్య ప్రాజెక్టు వ్యవస్థాపక అధికారి - డైరక్టర్‌గా పని చేసిన వీరు శ్రీ గోవింద రాజ స్వామి కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా 1986లో చేరారు.

వీరు అన్నమాచార్య పరంగా కాసెట్లు, ఎల్.పి. రికార్డులు, డాక్యుమెటరీ చిత్రాలు, సంగీత నృత్య కార్యక్రమాలు రూపొందించారు. విమర్శనాత్మక రచనలు వెలువరించారు. ఉపన్యాసాలు, వ్యాఖ్యానాలు వీరి ప్రత్యేకాంశాలు.

# మా తెలుగు తల్లికి మల్లె పూదండ

POTTI SREERAMULU TELUGU UNIVERSITY PUBLICATION